శుక్రవారం
9-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 167
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జిన్‌పింగ్‌కు సౌదీ అరేబియా ఘనస్వాగతం

సౌదీ అరేబియన్ రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్ ఆహ్వానం మేరకు ఆ దేశ రాజధాని రియాద్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేరుకున్నారు. ఆయన మూడు రోజులు ఆ దేశంలో పర్యటిస్తారు. ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

2 లో

నడ్డా అడ్డాలో
కమలానికి షాక్

హిమాచల్‌లో కాంగ్రెస్ ఘన విజయం

- 40 స్థానాల్లో గెలుపు
- 25 స్థానాలకే బీజేపీ పరిమితం
- గుజరాత్‌లో మళ్లీ బీజేపీ
- ఆప్‌కు జాతీయ హోదా
- ఖాతా తెరవని ఆమ్ ఆద్మీ పార్టీ
- సీఎం ఠాకూర్ రాజీనామా

సిమ్లా/అహ్మదాబాద్: బీజేపీ అధ్యక్షుడు నడ్డా అడ్డాలో కమలానికి షాక్ తగిలింది. నడ్డా సొంత రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. హోరాహోరీ పోరులో మ్యాజిక్ ఫిగర్‌ను దాటేసింది. 40 స్థానాలు గెలుచుకుంది. 68 స్థానాలు ఉన్న అసెంబ్లీలో 24 సీట్లకు బీజేపీ పరిమితం కాగా 67 స్థానాల్లో పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖాతా తెరవలేదు. ముగ్గురు స్వతంత్రులు విజేతలుగా నిలిచారు. గుజరాత్‌లో 37 ఏళ్ల రికార్డును అధిగమించి అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది. 156 స్థానాలను కైవసం చేసుకుని వరుసగా

- మిగతా 2 లో

జిగ్నేశ్ మేవానీ
గెలుపు

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రముఖ దళిత నాయకుడు జిగ్నేశ్ మేవానీ (41) విజయం సాధించారు. వద్గామ్ నియోజకవర్గం నుంచి ఆయన వరుసగా రెండవసారి గెలిచారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్యేగా ఇదే నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికయ్యారు. తమ అభ్యర్థిని నిలబెట్టకుండా జిగ్నేశ్‌కు కాంగ్రెస్ మద్దతిచ్చింది. తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసిన జిగ్నేశ్ మరోమారు

- మిగతా 2 లో

ఉప ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు

2 లో

కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనే లక్ష్యం

సీపీఐ పాదయాత్రకు
హైకోర్టు అనుమతి

- నేటి నుంచి 13వరకు రామకృష్ణ యాత్ర
- హౌస్‌మోషన్ పిటిషన్‌పై తీర్పు
- తక్షణమే అనుమతి ఇవ్వాలని పోలీసులకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విభజన హామీల్లో భాగంగా కడపలో నిర్మించాల్సిన ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. తొలుత ఈ యాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో గురువారం హైకోర్టులో సీనియర్ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ హౌస్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరించిన హైకోర్టు పాదయాత్రకు అనుమతి ఇవ్వాల్సిందిగా పోలీసులను ఆదేశిస్తూ తీర్పు ఇచ్చింది. సీపీఐ చేపట్టిన ఈ పాదయాత్రకు కొన్ని ఇతర రాజకీయపక్షాలు కూడా మద్దతిస్తున్నాయని, తద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. అందువల్లే పోలీసులు అనుమతి ఇవ్వలేదని కోర్టుకు తెలియజేశారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి రావు రఘునందనరావు స్పందిస్తూ కమ్యూనిస్టులకు నిబద్ధత ఎక్కువ. వారు చేపట్టే యాత్రకు అనుమతి నిరాకరించాల్సిన అవసరం ఏముందని వ్యాఖ్యానించారు.

అనుమతి ఇవ్వడానికి శుక్రవారం ఉదయం వరకు సమయం ఉందని చెప్పగా, ఆ సమయంలో అనుమతి ఇస్తే పాదయాత్ర ప్రారంభించడానికి సమయం ఎలా సరిపోతుందంటూ, తక్షణమే అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ... కడప ఉక్కు ఫ్యాక్టరీ కోసం సీపీఐ పాదయాత్ర చేపడితే పాలకుల్లో గుబులెందుకని ప్రశ్నించారు. పోలీసులు అనుమతి నిరాకరించడానికి కడప ఏమైనా నిషేధిత ప్రాంతమా? అని నిలదీశారు. అధికార పార్టీ సభలకు ఆగమేఘాల మీద అనుమతులు, పెద్ద ఎత్తున పోలీసు పహారా, ట్రాఫిక్ మళ్లింపు చేస్తున్న పోలీసు యంత్రాంగం ప్రతిపక్షాలను ఎందుకు అడ్డుకుంటోంది...పోలీసులు ప్రజా పక్షమా... కేవలం అధికార పార్టీ పక్షమా? అని మండిపడ్డారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన ఉక్కు ఫ్యాక్టరీని నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. అయితే రెండూ ఈ విషయంలో దొంగాటలాడుతున్నాయని విమర్శించారు. కడపకు ఉక్కు ఫ్యాక్టరీ అనేది భిక్ష కాదని, అది మన హక్కు అన్నారు. మన హక్కును ప్రభుత్వాలు విస్మరించినప్పుడు దానిని అమలు చేయించుకోవాల్సిన బాధ్యత మనపై ఉంటుందని, అందుకే సీపీఐ దీనిపై మలిదశ పోరాటానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈనెల 9వ తేదీ కన్యతీర్థం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 5 రోజులపాటు సాగుతుందని తెలిపారు. పాదయాత్రకు హైకోర్టు అనుమతి ఇవ్వడం ప్రభుత్వానికి చెంపపెట్టుగా పేర్కొంటూ, తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.

సమైక్యమే
మా విధానం

- సుప్రీం ఆదేశిస్తే స్వాగతిస్తాం
- ఉండవల్లి వ్యాఖ్యలు అర్థ రహితం
- సజ్జల రామకృష్ణారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అప్పుడూ, ఇప్పుడూ తమ పార్టీ విధానం సమైక్య రాష్ట్రమేనని, కుదిరితే ఆంధ్రప్రదేశ్ ఉమ్మడిగా ఉండాలనేదే తమ ఆకాంక్ష అని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ మళ్లీ ఏపీ ఉమ్మడి రాష్ట్రం కాగలిగితే...మొదట స్వాగతించేది తామేనన్నారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా వైసీపీ పోరాటం చేసిందని గుర్తుచేశారు. కాలచక్రాన్ని వెనక్కి తిప్పగలిగితే...రెండు రాష్ట్రాలు మళ్లీ కలవాలని సుప్రీంకోర్టు చెబితే అంతకన్నా కావాల్సింది ఏముందని వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలు కోసం ఈ ప్రభుత్వం పోరాటం చేస్తూనే ఉందని స్పష్టం చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రస్తావిస్తున్న కేసును...2014 విభజన చట్టంపై వేసిన కేసుగా తాను భావిస్తున్నానన్నారు. విభజన చట్టం అసంబద్ధమనే అంశంపై కేసు వేసినట్లున్నారని, ఇంతకాలం తర్వాత ఆయన ఎందుకు స్పందించారనేదీ

- మిగతా 2 లో

వైసీపీ కుంటిసాకులు

సజ్జల వ్యాఖ్యలపై రామకృష్ణ మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు కోసం కేంద్రంపై పోరాడలేకే వైసీపీ కుంటిసాకులు వెదుకుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏ అవకాశమున్నా ఏపీ ఉమ్మడిగానే ఉండాలని కోరతామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు పెళ్లయిన ఆరు మాసాలకు బాజాలు మోగించిన చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిదేళ్లుగా చేస్తున్న అన్యాయంపై పోరాడకపోతే వైసీపీకి రాజకీయ మనుగడ కష్టమవుతుందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి స్పందిస్తూ డొంక తిరుగుడు సమాధానమిచ్చారని రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఏ అవకాశమున్నా ఏపీ మళ్లీ ఉమ్మడిగానే ఉండాలని కోరతామని సజ్జల వ్యాఖ్యానించడం 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరినట్టు ఉంది. రాష్ట్ర విభజన చట్ట ప్రకారం ఏపీకి దక్కాల్సిన హామీలు, నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయలేక ఇలాంటి కుంటిసాకులు వెదుకుతున్నారని మండిపడ్డారు. 2019 ఎన్నికల సందర్భంగా 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ దాని మెడలు వంచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలు సాధిస్తామని వైసీపీ అధినేత జగన్ నాడు ఊకదంపుడు ఉపన్యాసా లిచ్చిన విషయం సజ్జలకు గుర్తులేదా అని నిలదీశారు. 30 మంది ఎంపీలున్నప్పటికీ కేంద్రంపై పోరాడకపోగా, మోదీ అడుగులకు ఎందుకు మడుగులొత్తుతున్నారు? వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఏమైంది? పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణాలకు నిధులు ఎందుకు రాబట్టలేకపోయారు? సీఎం సొంత జిల్లా కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు ఏమైంది? అని రామకృష్ణ ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి మొండిచేయి చూపితే జగన్ సర్కార్ ఏం చేసిందని నిలదీశారు. 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం అమ్మేస్తుంటే జగన్ చోద్యం

- మిగతా 2 లో

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్లకు సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బంగాళాఖాతంలో 'మాండస్' తుపాను దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వివిధ జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. సీఎంఓ అధికారుల సమావేశంలో తుపాను పరిస్థితులపై గురువారం ఉదయం సీఎం సమీక్షించారు. తుపాను ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎయిమ్స్‌లోనూ
ఆరోగ్యశ్రీ

- పేద రోగులకు ఉచిత వాహనం
- అతి త్వరలో పెట్ సిటీ స్కాన్
- ఏపీ-ఎయిమ్స్ మధ్య ఎంఓయూ

2 లో

ఇకపై మంగళగిరిలోని ఎయిమ్స్‌లో పేదలందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఎయిమ్స్-రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఆరోగ్యశ్రీ విషయమై గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది.

రైతు సమస్యల పరిష్కారం కోసం
ఫిబ్రవరి 1న
చలో పార్లమెంట్

- జనవరి 26న దేశ వ్యాప్తంగా నిరసనలు
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు
- ఉద్యమ కార్యాచరణలో ఏఐకేఎస్ భాగస్వామ్యం: రావుల వెంకయ్య

2 లో

ఖషోగి హత్యకేసులో సౌదీ యువరాజుకు ఊరట

కేసు కొట్టివేసిన అమెరికా కోర్టు

వాషింగ్టన్: అమెరికాకు చెందిన పాత్రికేయుడు జమాల్ ఖషోగి హత్య కేసులో సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌కు అమెరికా ఫెడరల్ కోర్టు ఊరటనిచ్చింది. కేసును న్యాయమూర్తి కొట్టివేశారు. ఈ కేసు నుంచి యువరాజుకు చట్టబద్ధమైన మినహాయింపు కల్పించాలన్న బైడెన్ యంత్రాంగం ఒత్తిడికి తలొగ్గింది. యువరాజు మహమ్మద్‌కు రక్షణ కల్పించాలన్న అమెరికా ప్రభుత్వ నిర్ణయంతో కేసును కొట్టివేసినట్లు కొలంబియా జిల్లా కోర్టు న్యాయమూర్తి జాన్ డి బేట్స్ వెల్లడించారు. ఆరోపణలు నమ్మదగినవే అయినాగానీ కేసును కొట్టివేసినట్లు న్యాయమూర్తి తెలిపారు. కాగా, 2018లో ఇస్తాంబుల్‌లోని సౌదీ రాయబార కార్యాలయంలో ఖషోగి హత్యకు గురయ్యారు. తన పెళ్లికి సంబంధించిన పత్రాల కోసం ఆయనకు అక్కడకు వెళ్లారు. అయితే ఈ ఆపరేషన్ మొత్తం యువరాజు కనుసన్నల్లో జరిగినట్లు అమెరికా ఇంటెలిజెన్స్ అప్పట్లో తేల్చిన విషయం విదితమే.

ఫిబ్రవరి 1న చలో పార్లమెంట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 1వ తేదీన చలో పార్లమెంటు నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. రిపబ్లిక్‌డే సందర్భంగా జనవరి 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. హర్యానా రాష్ట్రం కర్నాల్‌లోని కరసేవ గురుద్వారాలో గురువారం ఉదయం సంయుక్త కిసాన్‌మోర్చా సమావేశం జరిగింది. దీనికి దేశంలోని వివిధ రైతుసంఘాల నుంచి 70మంది రైతు నాయకులు హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్ష వర్గంగా ఎస్‌కేఎం నేతలు సత్యవన్, సురేష్‌కథ, కిషోర్‌దామ్లే వ్యవహరించగా, ఎస్‌కేఎం కన్వీనర్ దర్శన్‌పాల్‌సింగ్ అజెండాను ప్రతిపాదించారు. ఈ వేదికపై దర్శన్‌పాల్ సింగ్‌తోపాటు హసన్‌మొల్ల, హర్నిష్ మిట్టల్, అభిక్ష, ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య, బలదేవ్‌సింగ్ తదితరులు ఉన్నారు. నవంబరు 14వతేదీ తీసుకున్న నిర్ణయాలను వివరించారు. లఖింపూర్‌లో జరిగిన హత్యాకాండలో అశువులు బాసిన కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు నిర్వహించి, వారికి అండగా నిలవాలన్నారు. ఎస్‌కేఎం విధి విధానాలపై ప్రవేశపెట్టిన డాక్యుమెంట్‌ను ఈనెల 24న జరిగే సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించాలన్నారు. నవంబరు 26వ తేదీ దేశవ్యాప్తంగా చలో రాజ్‌భవన్‌ను జయప్రదంగా నిర్వహించామని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లో ఈ నెల 1నుంచి 10 వరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వాలని, 11వ తేదీ అన్ని రాష్ట్రాల్లో సామూహికంగా జన సమీకరణచేసి ప్రజాప్రతినిధులకు విజ్ఞాపనపత్రాలు అందజేయాలన్నారు. ఏఐకేఎస్ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ, భవిష్యత్తులో వ్యవసాయానికి మద్దతు ధరల కోసం, రుణ విమోచన చట్టబద్ధ హక్కు కోసం జరిగే ఉద్యమాల్లో ఏఐకేఎస్ అగ్రభాగంలో నిలుస్తుందన్నారు. ఎస్‌కేఎం ఉద్యమ కార్యాచరణకు సంపూర్ణ మద్దతు తెలిపి, అందులో భాగస్వాములమవుతామని చెప్పారు. గత నెల 14వ తేదీన ఎస్‌కేఎం తర్వాత ఏఐకేఎస్ తరపున అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు పంపామని, దాని పర్యావసానంగా 18 రాష్ట్రాల్లో 26వ తేదీ చలో రాజభవన్‌లో కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

ఏఓబీలో ఎదురుకాల్పులు..ఇద్దరు మావోల మృతి

విశాలాంధ్ర-సీలేరు(అల్లూరి జిల్లా): ఆంధ్రా ఒడిశా సరిహద్దు (ఏఓబీ)ల్లో మావోయిస్టులకు మరో ఎదురు దెబ్బ తగిలింది. మావోయిస్టు వారోత్సవాల దృష్ట్యా ఏఓబీలో కూంబింగ్ చేపట్టిన ఒడిశా పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో పాటు హ్యాండ్ గ్రనేడ్లతో దాడి చేయగా, పోలీసు బలగాలు ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారని ఒడిశా పోలీసులు తెలిపారు. ఒడిశాలోని కొందమాల్ జిల్లా తాడికొల గ్రామ సమీపాన ఘటకుప అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. ఎదురు కాల్పుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందగా మిగతా వారు తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఒకరిని ఏసిఎం ర్యాంక్ కమలగా గుర్తించగా, మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలం నుంచి భారీ పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని, తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఐజీ అమితాబ్ ఠాకూర్ తెలిపారు.

గుజరాత్‌లో ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి పరాజయం

ఖంభాలియా(గుజరాత్): గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఇసుదాన్ గద్వి అసెంబ్లీ ఎన్నికల్లో 18వేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఆయన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ఓట్ల లెక్కింపులో వెనుక నుంచి ఒక్కసారిగా ఆధిక్యంలో రావడంతో గద్వీకి ఓటమి తప్పలేదు. నాలుగో రౌండ్ ముగిసే సమయానికి కాంగ్రెస్‌కు చెందిన ప్రస్తుత ఎమ్మెల్యే విక్రమ్ మాడమ్‌పై గద్వి ఆధిక్యంలో ఉన్నారు. బీజేపీకి చెందిన ములుభాయ్ బేరా మూడో స్థానంలో వెనుకంజలో ఉన్నారు. అయితే ఓట్ల లెక్కింపు తర్వాతి రౌండ్లలో బేరా తన ప్రత్యర్థులను అధిగమించారు. సౌరాష్ట్ర ప్రాంతంలోని ఈ నియోజకవర్గం నుండి ఆప్ తన ముఖ్యమంత్రి అభ్యర్థిగా గద్విని పోటీకి దింపిన తర్వాత గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఖంభాలియా నియోజకవర్గానికి ప్రాముఖ్యత పెరిగింది. మాజీ టీవీ న్యూస్ యాంకర్, గద్వి ఖంభాలియాలో పుట్టి పెరిగారు. కానీ అహిర్ సామాజిక వర్గం ఆధిక్యత ఉన్న ఈ స్థానంలో సామాజిక సమీకరణాల దృష్ట్యా అతనికి ఫలితం అనుకూలంగా రాలేదు. గడచిన కొన్ని దశాబ్దాల్లో, అహిర్ సామాజిక వర్గం కాని అభ్యర్థి ఎవరూ ఈ స్థానం నుంచి గెలవలేదు. 2007, 2012లో బీజేపీ ఈ స్థానాన్ని గెలుచుకుంది. అయితే 2014లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ చేతిలో ఓడిపోయింది.

ప్రతి హామీ అమలు చేస్తాం: రాహుల్

న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు అద్భుత విజయం అందించిన హిమాచల్‌ప్రదేశ్ ప్రజలకు ఆ పార్టీ నేత రాహుల్‌గాంధీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరతామని స్పష్టంచేశారు. 68 స్థానాలకుగాను 39 సీట్లు గెలుచుకొని ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ సిద్ధమైంది. 'నిర్ణయాత్మక విజయాన్ని అందించిన హిమాచల్‌ప్రదేశ్ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు అభినందనలు. మీ కష్టం, అంకితభావమే ఈ విజయానికి కారణం' అని రాహుల్ గురువారం ట్వీట్ చేశారు. 'మీకు మరోసారి హామీ ఇస్తున్నా. మేమిచ్చిన హామీలన్నీ సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తాం' అని పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

జిన్‌పింగ్‌కు సౌదీ అరేబియా ఘనస్వాగతం

రియాద్: సౌదీ అరేబియన్ రాజు సల్మాన్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్ ఆహ్వానం మేరకు బుధవారం ఆ దేశ రాజధాని రియాద్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చేరుకున్నారు. ఆయన మూడు రోజులు ఆ దేశంలో పర్యటిస్తారు. ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఇదే క్రమంలో ఆయన చైనా-అరబ్ స్టేట్స్ సమ్మిట్, చైనా గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ) సదస్సులోనూ పాల్గొంటారు. జిన్‌పింగ్ విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత రాయల్ సౌదీ వైమానిక దళానికి చెందిన నాలుగు ఫైటర్ జెట్ విమానాలు వెంట రాగా రియాద్ గగనతలంలోకి ప్రవేశించిన తర్వాత రాయల్ ఎయిరోబాటిక్ బృందానికి చెందిన ఆరుగు సౌదీ హాక్ జెట్లు తోడు వెళ్లాయి. రియాద్‌లోని కింగ్ ఖలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన జిన్‌పింగ్‌కు 21 తుపాకులు పేల్చి ఘనంగా స్వాగతం పలికారు. ఎరుపు, పసుపు రంగులతో ఆకాశాన్ని సౌదీ హాక్స్ విమానాలు చిత్రీకరించాయి. ఇవి చైనా జెండాలోని రంగులు. జిన్‌పింగ్ కోసం హానర్ గార్డులు పర్పుల్ (ఊదారంగు) తివాచీ పరిచారు. రియాద్ గవర్నర్ ప్రిన్స్ ఫైసల్ బిన్ బందర్ అల్ సౌద్, విదేశాంగ మంత్రి ప్రిన్స్ ఫైసల్ బిన్ ఫర్హాన్ అల్ సౌద్, మంత్రి యాసిర్ అల్ రుమయ్యన్, రాజకుటుంబం కీలక సభ్యులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.

34 పెట్టుబడి ఒప్పందాలపై సంతకాలు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సౌదీ అరేబియా పర్యటన క్రమంలో రెండు దేశాల మధ్య 34 పెట్టుబడి ఒప్పందాలు జరిగాయి. ఈ మేరకు సౌదీ ప్రెస్ ఏజెన్సీ గురువారం వెల్లడించింది. బుధవారం ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు తెలిపింది. గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఉత్పత్తి, ఫొటోవోలటిక్ ఎనర్జీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సేవలు, రవాణా, వైద్య పరిశ్రమ, లాజిస్టిక్స్, నిర్మాణం తదితర ఒప్పందాలు జరిగినట్లు తెలిపింది. అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకునేలా ఒప్పందాలు జరిగాయని సౌదీ పెట్టుబడుల మంత్రి ఖాలిద్ బిన్ అబ్దుల్ అజీజ్ అల్ ఫల్హీ చెప్పినట్లు పత్రిక నివేదించింది. 2021లో చైనా-సౌదీకి మధ్య 304.3 బిలియన్ సౌదీ రియాల్ విలువ చేసే వాణిజ్యం జరిగింది. 2020లో జరిగిన దానికంటే ఇది 37శాతం అధికం.

విశాలాంధ్ర ప్రపంచం

పెరూ తొలి మహిళా అధ్యక్షురాలిగా దీనా బొలూర్టే

దేశానికైన గాయాలు మానేలా కృషిచేస్తా: తొలి ప్రసంగంలో హామీ

లిమా: పెరూ తొలి మహిళా అధ్యక్షురాలిగా దీనా బొలూర్టే (60) ప్రమాణ స్వీకారం చేశారు. 2026, జూలై 26 వరకు ఆమె ఈ పదవిలో కొనసాగుతారు. పెడ్రో కాస్టిల్లోపై అవిశ్వాసం అనంతరం అధ్యక్ష పగ్గాలను ఉపాధ్యక్షురాలిగా ఉన్న దీనా చేపట్టారు. కేవలం ఐదేళ్లలో ఐదుగురు అధ్యక్షులు మారారు. ఆరవ అధ్యక్షురాలిగా దీనా బాధ్యతలు చేపట్టారు. దేశానికి అయిన గాయాలన్నీ మానిపోయేలా తన వంతు కృషిచేస్తానని హామీనిచ్చారు. దేశంలో రాజకీయపరమైన రాజీ కోసం జాతీయ ఐక్యత దృష్ట్యా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని అధ్యక్షురాలిగా చేసిన తొలి ప్రసంగంలో దీనా సూచించారు. అన్ని వర్గాలతో కూడిన విస్తృత కేబినెట్ ఏర్పాటు చేస్తానని చెప్పారు. దేశాన్ని అవినీతి, దుష్పరిపాలన నుంచి కాపాడేందుకు కొంత సమయం ఇవ్వాలని, ఇది అమూల్యమైన సమయం అని అన్నారు. న్యాయవాది అయిన దీనా బొలూర్టే 2018లో లిమా మేయర్‌గా నాలుగు శాతం కంటే తక్కువ ఓట్లతో గెలిచారు. 2021 పార్లమెంటు ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఆపై దేశానికి ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆమెకు రాజకీయ అనుభవం లేనప్పటికీ ఏడాదిన్నరగా ప్రభుత్వ కార్యకలాపాలు చూస్తూ విధానపరమైన అనుభవాన్ని పొందిన క్రమంలో అధ్యక్ష బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలరని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే, బుధవారం నాటకీయ పరిణామాల క్రమంలో పెరూ మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లో అరెస్టు అయ్యారు. ఆయనపై శాసనసభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా ఆయనను పదవి నుంచి తొలగించేందుకు అనుకూలంగా 101 ఓట్లు వచ్చాయి. ఆరుగురు వ్యతిరేకంగా పది మంది గైర్హాజరయ్యారు. ఈ ఫలితాలు ప్రకటించినప్పుడు సభికులంతా హర్షం వ్యక్తం చేశారు.

మెయిన్‌పురిలో డింపుల్ యాదవ్ ఘన విజయం

కుర్హానీ అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకున్న బీజేపీ

న్యూఢిల్లీ/లక్నో: మెయిన్‌పురి లోక్‌సభ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ దక్కించుకుంది. ఇక్కడ నుంచి పోటీ చేసిన డింపుల్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ షాఖ్యాపై 2,88,461 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక బీహార్‌లోని కుర్హానీ అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. నితీశ్ కుమార్ నేతృత్వంలోని అధికార మహాకూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో డిసెంబర్ 5న జరిగిన ఉప ఎన్నికలకు ఓట్ల లెక్కింపు జరుగుతోంది. చత్తీస్‌గఢ్‌లోని భానుప్రతాపూర్ అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి సావిత్రి మాండవి ఆధిక్యంలో ఉండగా, రాజస్థాన్‌లోని చురు జిల్లాలోని సర్దార్‌షహర్ అసెంబ్లీ స్థానంలో అనిల్ కుమార్ ఆధిక్యంలో ఉన్నారు. రెండు స్థానాలు రెండు రాష్ట్రాల్లో అధికార కాంగ్రెస్‌కే దక్కాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఖతౌలీ, రాంపూర్ సదర్ అసెంబ్లీ స్థానాల్లో వరుసగా ఆర్‌ఎల్‌డీ, బీజేపీ ముందంజలో ఉండగా, ఒడిశాలోని బర్ఘర్ జిల్లాలోని పదంపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ ఆధిక్యంలో ఉంది. ఎస్పీ అధినేత ములాయం సింగ్ యాదవ్ కుటుంబానికి చెందిన మెయిన్‌పురిలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్, తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ షాక్యాపై 2.88 లక్షల ఓట్లతో గెలుపొందారు. ఖతౌలీలో బీజేపీకి చెందిన రాజ్‌కుమార్ సైనీపై ఆర్‌ఎల్‌డీకి చెందిన మదన్ భయ్యా 11,327 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారని ఎన్నికల సంఘం తెలిపింది. రాంపూర్ సదర్ నుంచి సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి అసిమ్ రాజాపై బీజేపీ అభ్యర్థి ఆకాశ్ సక్సేనా 6,746 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. బీహార్‌లోని కుర్హానీ స్థానంలో బీజేపీ అభ్యర్థి కేదార్ ప్రసాద్ గుప్తా 3,645 ఓట్ల తేడాతో జేడీ(యూ)కి చెందిన మనోజ్ సింగ్ కుష్వాహపై విజయం సాధించారు. ఆర్జేడీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ సహానీపై అనర్హత వేటు వేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

నందకుమార్, రామచంద్రభారతి మళ్లీ అరెస్టు

విశాలాంధ్ర-హైదరాబాద్: టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన నందకుమార్, రామచంద్ర భారతిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం మళ్లీ అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా వారిద్దరిని మళ్లీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నకిలీ ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కేసులో రామచంద్ర భారతిని, చీటింగ్ కేసులో నందకుమార్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఇద్దరికి షౌకత్ నగర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఇద్దరు నిందితులను పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన కేసులో తిరుపతికి చెందిన మఠాధిపతి సింహయాజి, హైదరాబాద్‌కు చెందిన నందకుమార్, మరో వ్యక్తి రామచంద్రభారతిని పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అక్టోబర్ 26న మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్‌లో వీరిని అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచి, అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించిన విషయం విదితమే.

ఫామ్ హౌస్ కేసులో ఇటీవలే బెయిల్ వచ్చింది. దీంతో జైలు అధికారులు వారిని గెరువారం విడుదల చేయగా, నకిలీ ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ కేసులో రామచంద్ర భారతిని, చీటింగ్ కేసులో నందకుమార్‌ను మళ్లీ అరెస్టు చేశారు.

ఉప ఎన్నికల్లో బీజేపీకి భంగపాటు

మెయిన్‌పురిలో ఎస్పీ ప్రభంజనం

2,28,461 ఓట్లతో డింపుల్ యాదవ్ గెలుపు

బీహార్‌లో జేడీయూ ఓటమి

రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ విజయం

న్యూఢిల్లీ/లక్నో: ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీకి భంగపాటు తప్పలేదు. రెండు స్థానాల్లో మాత్రమే స్వల్ప మెజారిటీతో గెలిచి వాటితో సరిపెట్టుకుంది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ ప్రభంజనం సృష్టించింది. రాజస్థాన్‌లో పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలిచింది. చత్తీస్‌గఢ్ స్థానం కూడా కాంగ్రెస్ పరమైంది. దీంతో హస్తం పార్టీ ఖాతాలో రెండు స్థానాలు చేరాయి. అటు ఒడిశాలో బీజేడీ రాణించింది. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోట అయిన మెయిన్‌పురి లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ సతీమణి డింపుల్ యాదవ్ ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ నేత రఘురాజ్ సింగ్‌పై 2,28,461 ఓట్లతో గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తాజా గెలుపు అఖిలేశ్‌కు కాస్త ఊరటను కలిచింది. సమాజ్‌వాదీ పార్టీ మిత్రపక్షమైన రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ) అభ్యర్థి మదన్ భయ్యా 22వేలకుపైగా ఓట్లతో ఖటౌలీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి రాజ్‌కుమార్ సైనిపై గెలిచారు. మదన్‌కు 97,071 ఓట్లు రాగా సైనికి 74,996 ఓట్లు పోలయ్యాయి. అలాగే, రాజస్థాన్, సర్దార్‌షహర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ శర్మ 26,850 ఓట్లతో బీజేపీ అభ్యర్థి అశోక్ పించాపై గెలిచారు. ఒడిశాలోని పదంపూర్ స్థానం నుంచి బీజేడీ నేత బర్షా సింగ్ బరిహా 42,679 ఓట్లతో బీజేపీ అభ్యర్థి ప్రదీప్ పురోహిత్‌ను ఓడించారు. చత్తీస్‌గఢ్‌లోని భానుప్రతాప్‌పూర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి సావిత్రి మనోజ్ మాండవి గెలిచారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి బ్రహ్మానంద నీతమ్‌పై 21,171 ఓట్లతో విజయం సాధించారు. అయితే ఎస్పీ నేత ఆజంఖాన్ కుంచుకోట రాంపూర్ సర్దార్‌లో బీజేపీ తొలిసారి గెలిచింది. ఖాన్‌పై అనర్హత వేటు పడిన విషయం విదితమే. మరోవైపు నాలుగు నెలల కిందట బీజేపీతో జేడీ(యూ) తెగతెంపులు చేసుకున్న తర్వాత జరిగిన ఎన్నికలు కావడంతో తాజా ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఏర్పడింది. కుర్హాని స్థానం నుంచి పోటీ చేసిన జేడీయూ అభ్యర్థి మనోజ్ సింగ్ కుష్వాహాను 3,645 ఓట్లతో బీజేపీ అభ్యర్థి కేదార్ ప్రసాద్ గుప్తా ఓడించారు. గుప్తాకు 76,653 ఓట్లు రాగా కుష్వాహాకు 73,008 ఓట్లు పోలయ్యాయి. ఆర్జేడీ ఎమ్మెల్యే అనీల్ కుమార్ సహానిపై అనర్హత వేటు క్రమంలో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. అటు రాజస్థాన్‌లోని సర్దార్‌షహర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ శర్మ విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి అశోక్ కుమార్ పించాపై 26,850 ఓట్లతో గెలిచారు. స్వాతంత్ర్యం తర్వాత నుంచి ఈ స్థానంలో కాంగ్రెస్ పదవ సారి గెలిచింది. కాంగ్రెస్ సీనియర్ నేత బన్వర్‌లాల్ శర్మ మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. తమ పార్టీని గెలిపించినందుకు సర్దార్‌షహర్ ప్రజలకు రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వ సుపరిపాలనకు ప్రజలు మెచ్చి శర్మను గెలిపించారన్నారు.

జిగ్నేశ్ మేవానీ గెలుపు

(మొదటిపేజీ తరువాయి)

విజేతగా నిలిచారు. తన ప్రత్యర్థులు మణిభాయి జేఠాభాయి వాఘెలా (బీజేపీ), దల్పత్‌భాయి దహ్యాభాయి భాటియా (ఆప్)పై ఘన విజయం సాధించారు. జిగ్నేశ్‌కు 94,765 (48శాతం) ఓట్లు రాగా మణిభాయికు 89,837 ఓట్లు పోలయ్యాయి. వీరిద్దరి మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. 4,928 ఓట్ల తేడాతో జిగ్నేశ్ గెలిచారు. మరోవైపు ఆప్ అభ్యర్థికి 4,493 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇదిలావుంటే, దళిత హక్కుల కోసం పోరాడే రాష్ట్రీయ దళిత్ అధికార్ మంచ్ కన్వీనర్‌గానూ జిగ్నేశ్ మేవానీ ఉన్నారు. వద్గామ్ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం కాగా ఇక్కడ ముస్లిం ఓటర్లు నిర్ణయాత్మక పాత్ర పోషిస్తారు.

ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.94 లక్షలు కాగా వీరిలో మూడో వంతు అంటే దాదాపు 90వేల మంది ముస్లింలు ఉన్నారు. దళిత ఓటర్లు 44వేల మేర ఉండగా రాజ్‌పుత్‌లు 15వేల మంది ఉన్నారు. మిగతా ఓటర్లు అందరూ ఓబీసీలు.

ఎయిమ్స్‌లోనూ ఆరోగ్యశ్రీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇకపై మంగళగిరిలోని ఎయిమ్స్‌లో పేదలందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఎయిమ్స్-రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఆరోగ్యశ్రీ విషయమై గురువారం అవగాహన ఒప్పందం జరిగింది. రెండు పక్షాలు ఎంవోయూ పత్రాలు మార్చుకున్నాయి. పేదలందరికీ ఉచితంగా, నాణ్యమైన వైద్యం అందించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనల మేరకు ఎయిమ్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని రజని తెలిపారు. కొద్ది రోజులుగా ఎయిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ట్రయల్ రన్‌ను చేపట్టామని చెప్పారు. ఇప్పటికే 100 మందికిపైగా రోగులకు ఎయిమ్స్‌లో ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు అందించామన్నారు. 30 మందికిపైగా చికిత్స చేయించుకుని ఇంటికి కూడా వెళ్లారని తెలిపారు. గురువారం అధికారికంగా రెండు పక్షాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. ఇకపై ఎయిమ్స్‌లో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులందరికీ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందుతాయని చెప్పారు. దీనివల్ల పేదలకు వైద్య సేవలు మరింత నాణ్యంగా అందుతాయన్నారు. అలాగే ఎయిమ్స్‌లో అతి త్వరలో పెట్ సిటీ స్కాన్‌ను ప్రారంభించబోతున్నామని మంత్రి విడదల రజిని ప్రకటించారు. శరీరంలో ఎక్కడ క్యాన్సర్ అవశేషాలు ఉన్నా సరే ఈ స్కాన్ ద్వారా పసిగట్ట వచ్చునన్నారు. క్యాన్సర్‌కు అంతర్జాతీయ స్థాయి వైద్యం ఏపీలోనే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎయిమ్స్‌కు ఇప్పుడు రోజుకు ఆరు లక్షల లీటర్ల నీటిని అందిస్తున్నామన్నారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, విజయవాడ కార్పొరేషన్ల నుంచి మూడేసి లక్షల లీటర్ల చొప్పున మొత్తం ఆరు లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామని వివరించారు. దీనివల్ల ఎయిమ్స్‌లో పూర్తి బెడ్ సామర్థ్యం మేర వైద్య సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే జూన్ కల్లా పైపు లైను పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. దీంతో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు ఎయిమ్స్‌లో 24 గంటలూ అందించాలని, అందుకోసం అదనంగా ఆరోగ్యమిత్రలను కూడా నియమించుకోవాలని అధికారులకు సూచించారు. ఎయిమ్స్ నుంచి రోగులను మంగళగిరికి చేర్చేందుకు ఉచిత వాహన సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ వంశీకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ప్రభుత్వ కార్యదర్శి నవీన్‌కుమార్, కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ జే ఎస్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నడ్డా అడ్డాలో కమలానికి షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఏడోసారి విజయం సాధించింది. మొత్తం 182 మంది సభ్యుల అసెంబ్లీలో బీజేపీ 156 స్థానాలు గెలుచుకొని 2002లో నెలకొల్పిన 127 స్థానాల సొంత రికార్డును బద్దలు కొట్టింది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ 17 స్థానాలకు పరిమితమైంది. కనిష్ఠ స్థానాలను నమోదు చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఐదు స్థానాల్లో గెలిచి జాతీయ పార్టీగా ఆవిర్భవించి సంతృప్తి చెందింది. మిగిలిన నాలుగు స్థానాల్లో ఇతరులు సత్తా చాటారు. 2017లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చిన పాటిదార్ ఓట్లన్నీ ఈసారి బీజేపీకి మళ్లినట్లు ఫలితాలు సూచించాయి. రాష్ట్రంలోని గ్రామీణ, గిరిజన, ఓబీసీ స్థానాల్లోనూ బీజేపీ మెజారిటీ సాధించింది.

హిమాచల్‌లో

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో డీలా పడ్డ కాంగ్రెస్‌కు హిమాచల్‌లో గెలుపుతో ఊరట దక్కినట్లయింది. కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆపార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నారు. కాగా, ప్రజా తీర్పును గౌరవిస్తున్నానంటూ ముఖ్యమంత్రి జైరాం ఠాకూర్ తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేశారు. గవర్నర్ ఆమోదించారు. సురేశ్ భరద్వాజ్, రామ్ లాల్ మార్కండ, సుర్వీన్ చౌదరితో పాటు అనేకమంది మంత్రులు ఓడిపోయారు. ఫత్తేపూర్ స్థానం నుంచి పోటీ చేసిన అటవీశాఖ మంత్రి రాకేశ్ పఠానియాను కాంగ్రెస్ అభ్యర్థి భవానీ సింగ్ చిత్తు చేశారు. వరుస పరాభవాలతో సతమతమవుతున్న కాంగ్రెస్‌కు హిమాచల్ ప్రదేశ్‌లో గెలుపుతో కొత్త ఊపిరి లభించింది. పార్టీలో నూతనోత్సాహం నిండింది. హస్తం పార్టీ వర్గాల్లో పూర్వవైభవం ఆశలు చిగురించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భారత్ జోడో యాత్ర వల్ల హిమాచల్‌లో తమ పార్టీ విజయం సాధించగలిగిందని అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తామని హిమాచల్ ప్రదేశ్ ప్రజలకు రాహుల్ గాంధీ హామీనిచ్చారు. తమ పార్టీని గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రాస్ గేమింగ్ రెవెన్యూపైనే 28శాతం జీఎస్టీ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్‌పై ప్రభుత్వం జీఎస్టీని18 శాతం నుంచి 28 శాతానికి పెంచినా, పరిశ్రమ బాగానే ఉందనీ, అయితే ఇది పోటీ ప్రవేశంపై కాకుండా స్థూల గేమింగ్ ఆదాయం (జీజీఆర్)పై మాత్రమే విధించబడుతుం దనీ, ఈ మొత్తం 2.2-బిలియన్ డాలర్ల తాకే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. స్థూల గేమింగ్ ఆదాయంపై ప్రస్తుతం 18 శాతం కంటే, 28శాతం జీఎస్టీ విధించడాన్ని రాబోయే జీఎస్టీ కౌన్సిల్ పరిగణించవచ్చని నివేదికలు చెబుతున్నాయి. జీజీఆర్ అనేది ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్ ద్వారా తమ ప్లాట్‌ఫారమ్‌లోని గేమ్‌లో పాల్గొనడానికి సర్వీస్ ఛార్జీలుగా వసూలు చేసే రుసుం.

వైసీపీ కుంటిసాకులు

(మొదటిపేజీ తరువాయి)

చూస్తున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన అనాలోచిత, ప్రజావ్యతిరేక చట్టాలకు, నిర్ణయాలకు వైసీపీ బేషరతుగా మద్దతిచ్చిన విషయం వాస్తవం కాదా? అని అన్నారు. ఇదేనా వైసీపీ డిక్షనరీలో 'పోరాటమంటే' అని నిలదీశారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే కుంటిసాకులు, మొకరిల్ల దాలు విడనాడి, రాష్ట్రానికి జరిగిన ద్రోహంపై కేంద్రంతో పోరాటానికి సిద్ధం కావాలని హితవు పలికారు.

సమైక్యమే మా విధానం

(మొదటిపేజీ తరువాయి)

అర్ధరహితమన్నారు. ఉండవల్లి మాటలు కొన్ని అసందర్భంగా ఉన్నాయని, పని కట్టుకుని జగన్‌ను విమర్శించినట్లు అనిపిస్తోందన్నారు. నాడు రాష్ట్రానికి అన్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీ అని, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నది బీజేపీ అని గుర్తుచేశారు. విభజనకు సహకరించి టీడీపీ అన్యాయం చేస్తే...చివరి నిముషం వరకూ విభజనకు వ్యతిరేకంగా వైసీపీనే పోరాటం చేసిందని గుర్తు చేశారు. విధిలేని పరిస్థితుల్లో రాష్ట్రం విడిపోయిన తర్వాత విభజన హామీల కోసం తమ పార్టీ పోరాటం చేస్తోందని, దౌత్యపరంగా, కోర్టుల్లో ఉన్న అంశాలపై పోరాడుతోందని వివరించారు. రాష్ట్రాన్ని అన్యాయంగా విభజించడం తమకు బాధ కలిగించిందన్నారు. విభజన హామీలనైనా మరింత మెరుగ్గా ఇవ్వాల్సిన బాధ్యత బీజేపీ ప్రభుత్వంపై ఉందన్నారు. దానికోసం ఎంతవరకైనా తమ ప్రభుత్వం పోరాడుతుందని, దానికి ఈ కేసు కూడా ఒక వేదికగా, అవకాశంగా ఉపయోగపడితే అన్యాయం జరిగిందని ఎత్తిచూపుతామని పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్రం ఉంటే అక్కడ కూడా అధికారంలోకి వచ్చేవాళ్లమని తెలిపారు. ఉండవల్లి ఎంపీగా చేశారనీ, అందరికీ ఆయన పట్ల గౌరవం ఉందన్నారు. సగటు రాజకీయ నాయకుడిగా ఎందుకు మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన హామీలపై ప్రభుత్వమే కోర్టులో పోరాడుతుందన్నారు. విజయవాడలో జయహో బీసీల సభ...బహిరంగ సభ కాదని, అది బీసీల సాధికార సభ అని స్పష్టం చేశారు. 85 శాతానికి పైగా ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ప్రజాప్రతినిధులు అందరూ ఒకచోట చేరారని, ఎన్నడూ లేనంతగా బీసీలు అత్యధికంగా ఎన్నికయ్యారన్నారు. ఆ సభ తమకు పరీక్ష కాదని, వైసీపీలో బీసీ ప్రజాప్రతినిధులు చేసుకున్న పండుగ అని అన్నారు. బీసీలకు చంద్రబాబు హయాంలో చేసిందేమీ లేదని, ఏదోవిధంగా బీసీలను విభజించాలని, జగన్‌పై వ్యతిరేకత తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రథమ శత్రువు టీడీపీనేనని పేర్కొన్నారు. చంద్రబాబు డీఎన్‌ఏ అనుకోవచ్చు, ఎన్డీఏ అనుకోవచ్చు, ఆర్ఎన్ఏ అనుకోవచ్చు, ఆయన ఏ పేరు పెట్టుకున్నప్పటికీ బీసీలంతా ముక్తకంఠంతో జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని పునరుద్ఘాటించారు.

అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

రైతులకు అవగాహన కల్పించాలని, వారికి సహాయకారిగా నిలవాలని సీఎం ఆదేశించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ టీంలను సిద్ధంగా ఉంచుకోవాలని, మత్స్యకారులను అప్రమత్తం చేయాలని, టోల్‌ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. లోతట్టు, తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు తదితర జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

జర్నలిస్టులకు ఎల్లప్పుడూ ప్రభుత్వ సహకారం

ఏపీ ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): సమాజ శ్రేయస్సుకు కృషి చేసే జర్నలిస్టులకు ఎల్లప్పుడూ ప్రభుత్వ సహకారం ఉంటుందని ఏపీ ప్రభుత్వ సలహాదారు(కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. వృత్తి పరంగా కలిగే మానసిక ఒత్తిళ్లపై జర్నలిస్టులకు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ప్రెస్ అకాడమీ అధ్వర్యాన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా జీవీడీ కృష్ణమోహన్, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, సీనియర్ జర్నలిస్టు రాధారెడ్డి పాల్గొన్నారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ... సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తూ ప్రజలకు సమాచారాన్ని అందిస్తున్న జర్నలిస్టులు... ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని తెలిపారు. వృత్తి రీత్యా ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతగానో దోహదపడతాయని, జర్నలిస్టులకు ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కృష్ణమోహన్ అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ... జర్నలిస్టుల్లో రక రకాల రూపాల్లో ఒత్తిడి ఉంటుందని దానిని ఎదుర్కోక తప్పదన్నారు. అయితే నిజాలతో కూడిన వార్తల ఒత్తిడికి, అబద్ధాలతో నిండిన వార్తల ఒత్తిడికి చాల తేడా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిజాయితీతో వార్తలు రాసినప్పుడు ఒత్తిడి వచ్చినా సంతృప్తికరంగా ఎదుర్కోవచ్చని, తెలిసి అబద్ధాలతో వార్తలు రాస్తే వచ్చే ఒత్తిడి అధిగమించటం కష్టమవుతుందని జర్నలిస్టులకు ఆయన సూచించారు. సంబంధింత జర్నలిస్టులకు మానసికంగా అపరాధభావం కారణంగా ఇంకా ఒత్తిడి పెరిగే అవకాశముందని హెచ్చరించారు. సదస్సుకు హాజరైన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వద్ద తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. యోగా, ధ్యానం, చిన్న చిన్న వ్యాయామాలు, సంగీతం లాంటి కళలపై దృష్టి పెట్టడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని రామసుబ్బా రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా కొమ్మినేని శ్రీనివాసరావు, జీవీడీ కృష్ణమోహన్, ఇండ్ల రామసుబ్బా రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. అవగాహన సదస్సును ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర తిలక్ సమన్వయపరిచారు. సదస్సులో ఐజేయూ జాతీయ ఉపాధ్యక్షుడు అంబటి అంజనేయులు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మరాజు చలపతిరావు, ఏపీయూడబ్ల్యూజే కృష్ణా అర్బన్ అధ్యక్షుడు చావా రవి, ఏపీయూడబ్ల్యూజే ఉపాధ్యక్షుడు కె.జయరాజ్, సీనియర్ జర్నలిస్టు షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

గిట్టుబాటు ధర ఇస్తాం

- ఆక్వా రైతుకు మంత్రి సీదిరి హామీ
- ఫిషరీస్ యూనివర్సిటీకి రూ.100 కోట్లు విడుదల
- మత్స్య కోర్సు ప్రవేశ ఫలితాల విడుదల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆక్వా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇప్పించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖామంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఏపీ మత్స్య విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలైన పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మత్స్య కళాశాలలో 'బ్యాచలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సులో (2022-23 విద్యా సంవత్సరం) ప్రవేశానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం సచివాలయ నాల్గవ బ్లాకు ప్రచార విభాగంలో మంత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్యవిద్యను అభ్యసించి, ఆ రంగంలో నైపుణ్యతను పొంది మత్స్య-ఆక్వారంగ సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

దేశంలో తమిళనాడు, కేరళ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో మత్స్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రానికి 972 కిలో మీటర్ల సుదీర్ఘ సముద్రతీరం కలిగి దేశంలోనే రెండవ అతిపెద్ద సముద్రతీరం కలిగిన రాష్ట్రంగా ఏపీ ఉండడమేగాక, ఆక్వా ఉత్పత్తుల్లో 30 శాతం ఆంధ్రప్రదేశ్ కలిగి ఉందని పేర్కొన్నారు. ఆక్వా ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో 35 శాతం అనగా సుమారు రూ.20వేల కోట్ల ఆదాయం ఏపీ నుంచే వస్తుందన్నారు. దేశంలో 3వ స్థానంలో ఏపీ నిలిచిందని మంత్రి అప్పల రాజు పేర్కొన్నారు. రూ.332 కోట్లతో నర్సాపురం సమీపంలో ఏర్పాటు చేస్తున్న మత్స్య విశ్వవిద్యాలయానికి గత నెలలో ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేయగా, తొలివిడతగా రూ.100 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి వివరించారు. ఈ విశ్వ విద్యాలయ ప్రాంగణంలోనే పీజీ, డిప్లొమా కళాశాలలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత మూడేళ్ల కాలంలో ఆక్వారంగ విద్యుత్ సబ్సిడీకి రూ.2,687 కోట్లు ఖర్చు చేశామని, ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50 పైసలకే అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ టి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

భరోసా ఇవ్వని రైతు భరోసా కేంద్రాలు

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

విశాలాంధ్ర-మోపిదేవి: రైతు భరోసా కేంద్రాలు... రైతుకు భరోసా ఇవ్వలేని కేంద్రాలుగా మారాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఎద్దేవా చేశారు. కృష్ణాజిల్లా మోపిదేవి మండలంలో రైతులు పండించిన పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసే విషయమై రైతులు పడుతున్న అవస్థలపై ప్రసాద్ స్పందించారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు జాప్యం చేస్తూ రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. పది రోజుల నుంచి ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి రైతులు ఆర్బీకేల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రానికి తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని రైతులు ఆందోళన చెందుతున్నరన్నారు. ధాన్యాన్ని రోడ్లపై రాశులుగా పోసి రోజుల తరబడి కాపలా కాస్తున్నారని, తేమశాతం ఎక్కువగా ఉందని ఆరబెట్టుకు రమ్మని చెప్పడంతో ధాన్యాన్ని ఆరబోయటానికి పట్టాల కోసం రూ.2500 అదనపు ఖర్చుగా రైతులు భారం మోయాల్సి వస్తోందన్నారు. కౌలు రైతులకు మిగిలే ఆదాయ వనరులు కాస్తా పట్టాలు, కూలీలకే సరిపోతాయన్నారు. ఎంటీయూ 1061 రకం గత సంవత్సరం వరకు "ఏ" గ్రేడ్ గా ఉండేదని క్వింటాకు 2060 రూపాయలు మద్దతు ధర ఉండగా ఈ ఏడాది ఆ రకాన్ని "బి "గ్రేడ్ గా మార్చడంతో క్వింటాకు 2040 రూపాయలు మాత్రమే మద్దతు ధర ఉండటంతో రైతు క్వింటాకు 20 రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ధాన్యం ఆరబెట్టేందుకు పట్టాల ఖర్చు 2500 అదనపు భారం పడడంతో రైతు పరిస్థితి మూలిగే నక్క మీద తాటికాయ పడిన చందంగా మారిందని ప్రసాద్ ఆందోళన వ్యక్తంచేశారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకుంటున్న జగన్‌మోహన్ రెడ్డి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. రోడ్డుపై పోసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు నిబంధనలను సడలించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని హితవు పలికారు. గత పది రోజుల నుంచి రైతులు రోడ్లపై అవస్థలు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం విచారకరమన్నారు. తుపాను ప్రభావంతో వర్షాల వల్ల ధాన్యం తడిసి రైతులకు నష్టం జరిగితే దాని బాధ్యత ప్రభుత్వం వహించాలని స్పష్టం చేశారు. త్వరితగతిన రైతుల సమస్యను పరిష్కరించాలని కేవీవీ ప్రసాద్ కోరారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం

డేగా ప్రభాకర్ విమర్శ

విశాలాంధ్ర-ఏలూరు: రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా నేరుగా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పించిందని, కానీ ఆచరణలో విఫలమైందని విమర్శిం చారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి గోనె సంచుల కొరత ఇప్పటికీ పరిష్కారం కాలేదని తెలిపారు. తేమ శాతంతో నిమిత్తం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తుపాను హెచ్చరికల వేళ ధాన్యం కల్లాలలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. రైస్ మిల్లర్లు కూడా ధాన్యం కొనుగోలు చేయవచ్చని పౌరసరఫ రాల శాఖ ఎండీ ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆరోపిం చారు. మిల్లర్ల దయాదాక్షిణ్యాలపై రైతులను వదిలేసేలా ఎండీ ప్రకటన ఉందని తెలిపారు. ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, క్రాప్ హాలిడే ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్, నిల్వ ఉంచుకోవడానికి సరైన స్టోరేజీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆక్వా రంగం నష్టాలబాటలో ఉండటంతో ప్రైవేటు వ్యాపారులు రుణాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం జోక్యం చేసుకొని బ్యాంకు రుణాలు ఇప్పించాలని కోరారు. రైతు సమస్యలపై శుక్రవారం ఏలూరు జిల్లా కేంద్రం స్ఫూర్తి భవనంలో జరిగే రైతుసంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. పెద్దసంఖ్యలో రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీలో చేరిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో గురువారం అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్‌రెడ్డి వైసీపీలో చేరారు. ఆయనతోపాటు అదే నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు జీవీ రాకేష్‌రెడ్డి, ఎం.వెంకటకృష్ణారెడ్డి, వి.ఉమాకాంత్‌రెడ్డి, బి.నరేందర్‌రెడ్డి, జి.నరేష్‌కుమార్‌రెడ్డి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం జగన్, నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రైలు దిగుతూ జారిపడి...

చికిత్స పొందుతూ ఎంసీఏ విద్యార్థిని మృతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ జిల్లా దువ్వాడ రైల్వే స్టేషన్‌లో రైలు-ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుని తీవ్రంగా గాయపడిన ఎంసీఏ విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే... అన్నవరానికి చెందిన విద్యార్థిని శశికళ (20) దువ్వాడలోని ఓ కాలేజీలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజూమాదిరే బుధవారం గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో దువ్వాడ చేరుకున్న ఆమె స్టేషన్‌లో రైలు దిగుతూ ప్రమాదవశాత్తు రైలు-ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుపోయింది. ఊహించని ఈ ఘటనతో ఖంగుతిన్న ఆ యువతి గంటల తరబడి నరకం అనుభవించింది. ప్రయాణికులు ఆమెను బయటకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. తక్షణమే స్పందించిన రైల్వే రెస్క్యూ టీమ్ ప్లాట్‌ఫామ్‌ను బద్దలుకొట్టారు. ఆమెను బయటకు తీసి షీలానగర్‌లో ఉన్న కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెను బతికించేందుకు శతవిధాలా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. నడుం భాగం తీవ్రంగా ఒత్తుకుపోవడంతో అవయవాలు దెబ్బతిన్నాయని, అంతర్గత రక్తస్రావం కావడంతో అత్యవసర చికిత్స అందించామని వైద్యులు తెలియజేశారు. చికిత్స పొందుతూనే గురువారం ఆమె మృతి చెందింది.చి వరి క్షణం వరకు మృత్యువుతో పోరాడిన శశికళ ప్రాణం వీడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

పాదయాత్రకు అనుమతి కోసం జిల్లా ఎస్పీకి సీపీఐ వినతి

విశాలాంధ్ర-కడప రూరల్: రాష్ట్ర విభజన చట్టంలో ఆమోదించిన కడప జిల్లా ఉక్కు కర్మాగారం పనులు ప్రారంభించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ చేపట్టిన డిసెంబర్ 9 నుంచి 13 వరకు పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ గురువారం కడపజిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అన్బు రాజన్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర నేతృత్వంలో ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ రాజ్యాంగం, సుప్రీంకోర్టు మార్గదర్శ కాలను అనుసరించి ఆర్టికల్ 14,18,19 ప్రకారం స్వేచ్ఛగా పాదయాత్రలు నిర్వహించు కోవచ్చనీ, ప్రజలకు ఆటంకం కలిగిస్తే ఆర్టికల్14 అనుసరించి పోలీసులు జోక్యం చేసుకోక తప్పదని గుర్తు చేసినట్లు, రాత పూర్వకంగా పాదయాత్రలకు అనుమతులు ఇవ్వలేమని తెలిపారు. పాదయాత్రలకు ఏదైనా ఆటంకం జరిగితే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వల్లగాని, వైసీపీ నేతల వల్ల మాత్రమేననీ, జిల్లా పోలీసుల వల్ల కాదనేది భావిస్తున్నామని సీపీఐ నాయకులు తెలిపారు. పాదయాత్రలకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా నిర్వహించి తీరుతామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, చంద్రశేఖర్ సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, బషిరున్నిసా, నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, మద్దిలేటి నాయకులు మనోహర్ రెడ్డి, ఓబయ్య, మునయ్య, మల్లికార్జున, లింగన్న, రామ్మోహన్, పుష్పరాజ్, వలరాజు, సుబ్బరాయుడు, మైనుద్దీన్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలి రేటు పెంచండి

బ్రేవరేజెస్ కార్యాలయం వద్ద హమాలీల ధర్నా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ బ్రేవరేజస్ కార్పొరేషన్ లిక్కర్ డిపోలలో ఎగుమతి, దిగుమతులు చేస్తున్న హమాలీలు తమ కూలి రేటు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం విజయవాడ ప్రసాదంపాడు బ్రేవరేజస్ ఎండీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎగుమతి కూలి ఒప్పందం పూర్తయి 13 నెలలు గడుస్తున్నప్పటికీ... తమకు కూలి పెంచకుండా నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమంటూ హమాలీలు నినదించారు. ధర్నాకు ఏఐటీయూసీతోపాటు వివిధ కార్మిక సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, ఇప్పటికే అనేక దఫాలు చర్చలు జరిగినప్పటికీ సిగ్మా కంపెనీ యాజమాన్యం అనుకూలమైన ఆలోచన చేయలేదన్నారు. బాక్స్‌కు ఎగుమతి కూలి ప్రస్తుతం ఏడు రూపాయలు ఇస్తుండగా, దానిని హమాలీలు రూ.10 కోరుతున్నారని, మూడు రూపాయలు పెంచడానికి సిగ్మా కంపెనీ యాజమాన్యం, కార్పొరేషన్ అధికారులు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. సీఐటీయూ నాయకుడు ఆర్వీ నరసింహారావు మాట్లాడుతూ, డిసెంబర్ 10వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామంటూ నవంబర్ 21న ఎండీకి హమాలీలు నోటీసు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వైఎస్ఆర్ టీయూసీ రమణ మాట్లాడుతూ, హమాలీలకు ప్రస్తుతం ఇస్తున్న కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు యు.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కార్మికుల ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఏఐటీయూసీ హమాలీ యూనియన్ నాయకులు లోకేశ్, స్టీఫెన్ తులసీరావు, సురేంద్ర, శీను, అప్పారావు, సీఐటీయూ హమాలీ యూనియన్ నాయకులు సుబ్బారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, కార్పొరేషన్ అధికారులు సీజీఎం వేణుగోపాల్, కృష్ణ, గోపీ నాయుడు తదితరులు హమాలీల వద్దకు వచ్చి కార్మిక సంఘాల నేతలతో చర్చించారు. ఈనెల 15న సిగ్మా కంపెనీ, హమాలీ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

5.20 లక్షల గ్రామ సారథులు: సీఎం జగన్

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బలోపేతం కోసం 5లక్షల 20వేల మంది గ్రామ సారథులను నియమించనున్నట్లు సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. క్లస్టరుకు ఇద్దరు చొప్పున గ్రామ సారథులను నియమించాలని, ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల్లో ముగ్గురు పార్టీ కన్వీనర్లు, ఇందులో తప్పనిసరిగా ఒక మహిళకు ప్రాతినిధ్యతివ్వాలని ఆదేశించారు. ప్రతి 50 కుటుంబాలను ఒక క్లస్టరుగా గుర్తించాలన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల పార్టీ పరిశీలకులతో పార్టీని బలోపేతం చేయాల్సిన అంశాలపై జగన్ చర్చించారు. పార్టీ తరపున ఈ నియామకాల ప్రక్రియ మొత్తం నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల నేతృత్వంలో కొనసాగుతుందని, ఎంపికలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి ఎమ్మెల్యేను గెలిపించాలన్నదే పరిశీలకుల లక్ష్యం కావాలనీ, 175కి 175 గెలవాలంటూ సీఎం దిశానిర్దేశం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు కింద స్థాయిలో ఇంటింటికీ వెళున్నారని, నెలకు కనీసంగా 4 నుంచి 5 సచివాలయాల్లో తిరుగుతున్నారని వివరించారు. ఓవైపు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతున్న సమయంలో మిగిలిన గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ చురుగ్గా పార్టీ కార్యక్రమాలు కొనసాగాలని, దీనికోసం 10-15 రోజుల్లో 1.66 కోట్ల కుటుంబాలను పార్టీ తరపున కలుసుకునేందుకు కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. 50కుటుంబాల వారీగా మ్యాపింగ్ చేస్తున్నామని, ప్రతి 50ఇళ్లకు ఒక పురుషుడు, ఒక మహిళ, గృహసారథులుగా ఉంటారని తెలిపారు. గ్రామ లేదా వార్డు సచివాలయాల పరిధిలోనూ పార్టీ తరపున ముగ్గురు కన్వీనర్లు ఉంటారని, వారిలో కనీసం ఒక్కరు మహిళ ఉంటారని తెలిపారు. రాజకీయ అవగాహన ఉన్న వారు, చురుగ్గా ఉన్నవారిని కన్వీనర్లుగా ఎంపిక చేయాలన్నారు. మొత్తంగా 50ఇళ్లకుగాను ఇద్దరు చొప్పున 15వేల గ్రామాల్లో 5.2 లక్షల మంది గృహసారథులు ఉంటారనీ, అంతేకాకుండా గ్రామ, వార్డు సచివాలయాల్లో మరో 45వేల మంది కన్వీనర్లు ఉంటారని వెల్లడించారు. ముందస్తుగా దాదాపు 15వేల సచివాలయాలకు ముగ్గురు చొప్పున కన్వీనర్ల ఎంపికను ప్రారంభించాలని ఆదేశిం చారు. ఒకవైపు ఎమ్మెల్యేలు గడపగడపకూ తిరుగుతూనే.. మరోవైపు సచివాలయాలకు ఎంపిక చేసిన పార్టీ కన్వీనర్లు కూడా గడపగడపకూ తిరుగుతారని స్పష్టం చేశారు.

బీసీ సభలో ఒక్క పథకమైనా ప్రకటించారా?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'జయహో బీసీ' పేరుతో విజయవాడలో అధికార వైసీపీ నిర్వహించిన సభలో వెనుకబడిన తరగతులకు ఒక్క కొత్త పథకంగాని, అదనంగా నిధులుగాని ప్రకటించకపోవడం ఆయా తరగతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త పథకాల సంగతి అటుంచితే, గతంలో ఉన్న వాటికి కూడా నిధులు కత్తిరించారని విమర్శించారు. కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి నిధులు కేటాయించకపోవడంతో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయని అన్నారు. నవరత్నాలలో భాగంగా వివిధ వృత్తుల వారిలో దాదాపు సగం మందికి లబ్ధి అందకుండా పోయిందని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో తప్పులను సరిదిద్దేందుకు తగిన యంత్రాంగం లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. బీసీల సంక్షేమం, వివిధ వృత్తుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని, అర్హులైన వారందరికీ పథకాలు అందేలా తప్పొప్పులను సరిదిద్దేందుకు ఆన్‌లైన్లో ప్రత్యేక అవకాశం కల్పించాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బీసీ సభ నిర్వహణలో అధికార దుర్వినియోగం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులను తరలించారన్నారు. వివిధ ప్రజాసంఘాలు, ప్రతిపక్షాల చిన్నపాటి నిరసనలు, సభలు, ప్రదర్శనలకు విపరీత ఆంక్షలు విధించే పోలీసు యంత్రాంగం బీసీ సభకు మాత్రం ప్రేక్షకపాత్ర వహించడం గర్హనీయమన్నారు.

దేశ సంపద కార్పొరేట్‌ల వశం: బృందాకరత్

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ప్రధాని నరేంద్ర మోదీ పెట్టుకున్న కళ్ళజోడుకు పేదల కనిపించడం లేదని, పేదల పొట్ట కొట్టి అంబానీ, అదానీల జేబులు నింపుతున్నారని మాజీ ఎంపీ బృందాకరత్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ రాష్ట్ర మహాసభల సందర్భంగా స్థానిక కుంజా బొజ్జి, సున్నం రాజయ్య సభ ప్రాంగణంలో జరిగిన బహిరంగ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు గురించి చెబుతుందని, పేదల బతుకులు మార్చే అసలైన రత్నం భూమి ఎందుకు పంచడం లేదని బృందాకరత్ ప్రశ్నించారు. ఇప్పటి వరకూ 12,300 మంది పేదలపై తప్పుడు కేసులు పెట్టి, 125మందిని జైలుకు పంపారని చెప్పారు. మోదీ ప్రభుత్వానికి ప్రభుత్వానికి పేదలు, వితంతువులు, కష్టజీవులు కనిపించడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ. విజయ రాఘవన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సమస్యలపై పోరాటాలు విస్తరించేందుకు మహాసభలు జరుగుతున్నాయని, దేశంలో పేదల జీవితాలు దుర్భరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ కార్యదర్శి బీ వెంకట్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పేరుతో రోజుకో పథకం ప్రవేశపెడుతుందని పేదల బతుకు మార్చే భూమి మాత్రం పంచడం లేదని విమర్శించారు. ఈ సభలో కేరళ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ చంద్రన్, ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వర్లు, షేక్ సాబ్జీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం తదితరులు పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది వ్యవసాయ కార్మికులు తరలి వచ్చారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

అంతకుముందు వ్యవసాయ కార్మికులు తమ సమస్యల పరిష్కారం ఎర్రజెండాల చేత పట్టుకుని 'భూమి పంచాలి-కూలి పెంచాలి' అంటూ స్థానిక మార్కెట్ యార్డులో బయలుదేరిన మహా ప్రదర్శనగా బుట్టాయిగూడెం రోడ్, పాత పంచాయతీ కార్యాలయం, గంగానమ్మ గుడి, సెంటర్ పెరంపేట రోడ్డు మీదుగా జంగారెడ్డిగూడెం బస్టాండ్ పక్కన ఏర్పాటు చేసిన కుంజా బొజ్జి, సున్నం రాజయ్య సభా ప్రాంగణానికి మహా ప్రదర్శన చేరుకుంది. మహా ప్రదర్శనతో పట్టణం ఎరుపెక్కింది. ప్రదర్శనకు ముందు భాగాన గిరిజన నృత్యాలైన రేల దాన్సులు, డోలు వాయిద్యాలు డప్పుల దరువులతో ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. 'కనీస కూలి చట్టం అమలు చేయాలని, 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, పెరిగే ధరలకు హద్దు లేదు, ఏలే వాడికి బుద్ధి లేదు' వంటి నినాదాలతో ప్రదర్శన సాగింది. ఈ భారీ ప్రదర్శనను పట్టణవాసులు ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏ రవి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, అధ్యక్షుడు ఆర్ లింగరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణరైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు సుభాషిని ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూకు ఆస్ట్రేలియా ప్రతినిధి



విశాలాంధ్ర-విశాఖ సిటీ: ఆస్ట్రేలియా వాణిజ్య, పెట్టు బడుల కమిషన్ డైరెక్టర్(సౌత్ ఏషియా) కె.సంతోశ్ గురువారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి నేతృత్వాన ఏయూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆస్ట్రేలియాతో సంయుక్తంగా కలిసి పనిచేయడం, పరస్పర సహకారం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఏయూ తరపున సంతోశ్‌ను సత్కరించారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, అంబేద్కర్ చైర్ డాక్టర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

సుప్రీంకోర్టు హక్కులకు కత్తెర?

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంపై చాలా కాలంగా చర్చ సాగుతోంది. ఇటీవల ఈ విషయం ఎక్కువసార్లు చర్చల్లోకి వచ్చింది. కొలీజియం సిఫారసు చేసినవారిని న్యాయమూర్తులుగా తీసుకోవాలన్న నిశ్చితాభిప్రాయాన్ని సుప్రీం వ్యక్తం చేసింది. దీనిపైన న్యాయశాఖమంత్రి కిరణ్ రిజిజు అనేకసార్లు తీవ్రంగా మాట్లాడారు. న్యాయమూర్తుల నియామకం హక్కు పార్లమెంటుదేనని సుప్రీంకోర్టుకు ఆ హక్కులేదని అన్నారు. సుప్రీంకోర్టుకుగల హక్కులను కత్తిరించేందుకు 2014లో అధికారం చేపట్టిన నాటినుంచి నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని స్పష్టమవుతోంది. ప్రధాని మోదీ ఆశీస్సులు లేకుండా మంత్రి రిజిజు స్వతంత్రంగా మాట్లాడి ఉంటారన్నది సందేహమే. సుప్రీంపై దాడి చేయడానికి అత్యున్నత స్థానం అలంకరించిన ఉపరాష్ట్రపతి ధన్కర్ రిజిజు బాధ్యత తీసుకున్నారని తాజాగా రాజ్యసభలో సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా మాట్లాడటం స్పష్టం చేస్తోంది. మోదీ ప్రభుత్వ ఆలోచనలు 2014లోనే స్పష్టంగా తెలుస్తున్నాయి. 99వ రాజ్యాంగ సవరణ ద్వారా జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ బిల్లును పార్లమెంటు ఆమోదిం చింది. 2014 ఆగస్టు 13న ఈ బిల్లును లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించగా ఆ మరుసటిరోజే రాజ్యసభ తన అంగీకార ముద్ర వేసింది. ఈ కమిషన్ ద్వారా న్యాయమూర్తులను ప్రభుత్వమే నియమించడానికి హక్కు ఉంటుంది. నేటి రాజకీయ వ్యవస్థలో నీతి, నిజాయితీ పూర్తిగా లోపించాయి. ప్రభుత్వం సర్వాధికారాలను స్వాయత్తం చేసుకునే దిశలో పయనిస్తున్నవేళ న్యాయమూర్తుల నియామకాలు లోపభూయిష్టంగా ఉండవచ్చు. తనకు అనుకూలమైన న్యాయమూర్తులను నియమించుకొని రహస్య లక్ష్యాలను సాధించుకొనే వీలు ప్రభుత్వానికి కలుగుతుందని అనేకమంది న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. వారికే కాదు..నేటి రాజకీయ పరిణామాలను పరిశీలించేవారికీ అనిపిస్తుంది. అయితే కమిషన్ ఏర్పాటును సుప్రీంకోర్టు తిరస్కరించింది. కమిషన్ ఏర్పాటు రాజ్యాంగ మౌలిక న్యాయవ్యవస్థకు అనుగుణమైందికాదని 2015 అక్టోబరు 16న మెజారిటీ న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఐదుగురితో కూడిన ధర్మాసనంలో నలుగురు కమిషన్‌ను తిస్కరించారు. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ చర్యలెంతమాత్రం పార్లమెంటు సార్వభౌమాధికారాన్ని ధిక్కరించినట్టు కాదు. ప్రజలు ఎన్నుకున్న పార్లమెంటును అవమానించడమూ కాదు. ఎన్‌జెఎసిని ఏర్పాటుచేసి ఉండకపోతే మోదీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టుకుగల అధికారాన్ని స్వాయత్తం చేసుకొనే యోచనలో ఉన్నారన్న అభిప్రాయమే ఎవరికీ కలిగి ఉండేదికాదు. హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల కోసం లాంఛనప్రాయం సంప్రదింపుల ప్యానల్‌ను ఏర్పాటుచేయడం రాజ్యాంగ చెల్లుబాటుపై సందేహం వ్యక్తంచేస్తూ 1978 జనవరి 4వ తేదీన లా కమిషన్ చైర్మన్ తన అభిప్రాయాన్ని వెల్లడిస్తూ న్యాయ, కంపెనీ వ్యవహారాలశాఖ మంత్రికి లేఖ రాసారు. న్యాయమూర్తులను నియమించడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయశాఖ మంత్రి ఎక్స్‌అఫీషియో సభ్యులుగా, సుప్రీం ప్రధాన న్యాయమూర్తి లేదా జడ్జిలుగా పనిచేసిన ముగ్గురితో కూడిన ప్యానల్ ఏర్పాటుచేయడం మంచిదని లా కమిషన్ చైర్మన్ తన లేఖలో సూచించారు. ఈ ప్యానల్ చైర్మన్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని కూడా ఆయన పేర్కొన్నారు. ప్యానల్ ఏర్పాటుకు ముందు ఇద్దరు అత్యంత సీనియర్లయిన ఇద్దరు సహచర న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి సంప్రదించాలని కూడా లా కమిషన్ సిఫారసు చేసింది.

న్యాయవ్యవస్థ అధికారాలను తగ్గించాలని లేదా హరించాలని ఎందుకు మొండి పట్టుదలతో ఉన్నదో మోదీ ప్రభుత్వం వెల్లడించాలి. అలాగే ఈ అంశాన్ని మరింత వివాదాస్పదం చేయాలన్న భావనతో ఉపరాష్ట్రపతి ధన్కర్ పరుషంగా మాట్లాడారన్న సందేహం వ్యక్తమవుతోంది. అయితే ధన్కర్ తొలినుంచి నరేంద్ర మోదీకి విధేయుడిగా పనిచేస్తున్నారు. పశ్చిమబెంగాల్ గవర్నరుగా పనిచేసినప్పుడు ఆయన చర్యలు, వ్యక్తం చేసిన అభిప్రాయాలు మోదీకి విశ్వాసపాత్రుడిగా వ్యవహరిస్తున్నారని తెలిసిందే. పైగా రాజ్‌భవన్‌ను బీజేపీ కార్యాలయంగా మార్చుకొని ఆ పార్టీ నేతలను పిలిపించుకొని మాట్లాడేవారన్న విమర్శలూ ఉన్నాయి. ఈ పరిణామాలు సుప్రీంకోర్టు, ప్రత్యేకించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్ చెప్పిందే తుది మాట కారాదన్న పట్టుదలతో మోదీ ప్రభుత్వం ఉందని తెలియ జేస్తున్నాయి. ఎన్‌జెఎసి చట్టాన్ని సుప్రీంకోర్టు రద్దుచేయడం పార్లమెంటు సార్వభౌమాధికారంపై దాడిచేయడమేనని, ఇది కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోందని రాజ్యసభలోనే ధన్కర్ మాట్లాడటం వల్ల కోర్టుకు ప్రభుత్వానికి మధ్య వివాదం తీవ్రతరం అవుతుందన్న అభిప్రాయం కలుగుతోంది. సుప్రీంకోర్టు తన వైఖరిని మార్చుకోవాలని, లక్ష్మణరేఖ పరిధిలో ఉండాలని వ్యాఖ్యానించడం కచ్చితంగా సర్వోన్నత న్యాయ స్థానాన్ని మోదీ ప్రభుత్వం తన ఆధీనంలోనే పనిచేయ వలసిందేనన్న నిర్ణయంతో వ్యవహరిస్తోంది. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయోధ్య వివాదంపై మాజీ ప్రధాన న్యాయమూర్తి బీజేపీకి అనుకూలంగా తీర్పు చెప్పారు. అలాగే కశ్మీరుకు గల స్వయంప్రతిపత్తిని హరించడానికి 370వ అధికరణను ప్రభుత్వం రద్దుచేసినప్పటికీ దాన్ని సమర్థిస్తూ ఆనాటి ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఆ న్యాయమూర్తికి ప్రభుత్వం రాజ్యసభ సభ్యత్వం కట్టబెట్టడానికి కారణం అనుకూల తీర్పులేనన్న విమర్శలున్నాయి. అన్ని రాజ్యాంగ వ్యవస్థలు మోదీ కనుసన్నల్లో పనిచేస్తున్నాయన్న అభిప్రాయం విస్తృతంగా ప్రజానీకంలోఉంది. ఏమైనా రెండు రాజ్యాంగ వ్యవస్థల మధ్య వివాదం ఎంతమాత్రం మంచిది కాదు. రాజ్యాంగ నిపుణులైన న్యాయమూర్తులకే కాబోయే న్యాయమూర్తుల సామర్థ్యం, నీతి, నిజాయితీ విలువల పాటింపు అంశాలను అంచనా వేయగలుగు తారనేది సర్వత్రా గల అభిప్రాయం.

శివం శవం

రా బావ ఏమిటి ఈ రోజు విషణ్ణవదనంతో వస్తున్నావు. ఏం జరిగింది ముందు కాఫీ తాగు తర్వాత మాట్లాడుకుందాం. ఏం లేదు బావ నా స్నేహితుడొకడు చనిపోతే వెళ్లాను. అక్కడ జరిగిన తతంగం చూశాక నాకు చాల బాధ అనిపించింది. ఇంటికి వెళ్లి తలస్నానంచేసి నీ దగ్గరికి వచ్చా. అదా సంగతి ఎవరా స్నేహితుడు నిన్ను యింతగా బాధకు గురిచేసిన ఆ సంఘటన ఏమిటి బావ. ఏం లేదు బావ రామారావని చిన్ననాటి స్నేహితుడు ఆయన అనేక ప్రయిజులతోపాటు పద్మశ్రీ కూడ పొందాడు. కాని చనిపోగానే పనికిరానివానిగ బైటపెట్టి పిల్లల్ని శవం దగ్గరకు రానివ్వరు ముట్టుకో కూడదు. తిరుపతి దేవునికి నిలువుదోపిడి యిచ్చినట్లు ఆ బట్టలు బైట పారేసి తలస్నానం చేయాలట ఏంటి బావ యింత ఘోరం. బావ శివం అంటే ప్రాణం. ప్రాణం పోయాక అదే శరీరాన్ని శవం అని దూరాన పెడుతున్నాం. మరణం భయంకరమైనదనే భయం నన్నింతకాలం మరణానికి భయపడి పురోహితవర్గం ఏర్పాటు చేసిన అనవసర క్రతువులు ఎన్నెన్నో చేస్తున్నాం. అవన్నీ చేయకపోతే ఏంఅవుతుంది బావ. ఏంకాదు బావ మరణం అనంతరం పదార్థం రూపాంతరం చెంది వీడటమనేది ఒక కళాత్మక మార్పు బావ. ప్రాణం ఉన్న ఒక మేధావి సమాజానికి ఎంతో విలువైనవాడు ప్రాణం పోగానే అనవసర నిర్జీవ పదార్థంగా భావించి దూరంచేసే ప్రయత్నం చేస్తున్నాం. బావ సహజ మరణం, ప్రమాదవశాత్తు జరిగే మరణం రెండు రకాలు. మానవజన్మ అతిహీనమైనదని దు:ఖబాజ్యమైనదని మతస్థులు బెబుతున్నారుగ బావ.

అదే బావ మనిషిని నిమిత్తమాత్రునిగ చిత్రించి పరాధీనుడుగ మార్చి దేవున్ని సృష్టించి దేవుడు ఆడించే కీలుబొమ్మగా మతస్థులు చిత్రించారు బావ. దీనితో మనిషి నిమిత్తమాత్రుడని తనవల్ల ఏమీకాదని పరాధీనుడుగ మారాడు. అదినిజమే బావ 99శాతం ప్రజలు అదేభావనలో బతుకు



తున్నారుగ బావ. నిజమే బావ పదుగురాడుమాట పాటియై ధర చెల్లు అనే నానుడి ఉందిగ బావ అలా పాటించని వాడిని వితండపు మనిషని పిలుస్తున్నారుగ బావ. బావ మరణం తరువాత శరీరం జడత్వంగా మారు తుంది. మనిషిపుట్టుక మరణంపట్ల వారికి శాస్త్రీయ అవగాహన లేకపోవడం వల్లనే అనవసర క్రతువులన్నీ జరిపి పురోహితులను పోషిస్తున్నాం. ఒక మేధావి సమాజానికి ఎంతో విలువైనవాడు. కాని అతను చనిపోగానే అతడొక నిర్జీవ పదార్థంగా మారి అతి తొందరగా దాన్ని దూరంచేసే ప్రయత్నం చేస్తున్నాం బావ. నిజమె బావ కనీసం అతనితో పరిచయంలేని వ్యక్తులైనా సరె దారినపోతూ ఎవరా అని చూచినా, వెంటనే యింటికెళ్లి బట్టలు విడిచి స్నానం చెయ్యవలసిందే. అసలునాకు తెలియక అడుగుతాను శవం దగ్గరెల్లినంత మాత్రాన మనకు ఏం అంటుకుంటుందని ఈ నియమాలు బావ. నిజమే బావ ఈ రకంగా పనికిరాని క్రతువులు, పురోహితుల పోషణార్థం సృష్టించారు. మనిషి గర్భస్థ శిశువుగా ఉన్నప్పటి నుంచి దాదాపు 20ఏళ్లు నిండేవరకు అతని దేహం అనేక రూపాలుగా పరిణామం చెందడం మనం చూస్తున్నాం. కాని మానవజన్మ అతి హీనమైన దని మతస్థులు చెప్పి మనిషి తనశక్తిని తాను మరచి మనిషి సృష్టించిన కంటికి కనపడని దేవునిపై ఆధారపడేట్లు మతం చేసింది బావ. కాని మానవజన్మే అన్ని జన్మల్లోకి అతి ఉత్కృష్టమైంది. పుట్టడం గిట్టడం అంతా బ్రహ్మలిఖితంగా మనిషికి నూరిపోసి మనిషిని నిమిత్త మాతృనిగ మతం చేసింది బావ. నిజమే బావ ఒక పక్క చంద్రునిపైకి వెళ్లి అక్కడి ప్రదేశం నివాసయోగ్యమా కాదా అని ప్రయోగాలు చేస్తుంటే అది చంద్రుడుకాదు అది ఒక గోళం అని శాస్త్రజ్ఞులు చెబుతుంటే యింకా ఆ కట్టుకథలు మనిషిపై రుద్దే ప్రయత్నం ఏంటి బావ. నిజమే బావ మానవుడు విజ్ఞానవంతుడై విశ్వంలోకి ప్రవేశించి విశ్వ రహస్యాన్ని శోధించగలిగాడు. అటువంటి మనిషిని కేవలం పూజలకు, భజనలకు పరిమితం చేసి ప్రాణం పోయిన మనిషిని అంటుకోకూడదని మత నియమాల్ని శాస్త్రం ఖండిస్తూనే ఉంది బావ. మనిషిపుట్టి తరువాత చనిపోయేలోపు ఎంతో విజ్ఞానాన్ని సంపాదించి తద్వారా మానవత్వంవైపు అడుగులువేస్తూ తను పొందిన జ్ఞానం, అనందం విశ్వమానవునికి అందించాలని తపిస్తున్నాడు బావ. ఆ రకంగా సమాజంలో ప్రత్యేక స్థానం పొందడం ద్వారా అన్నింటికి మనిషే మూలమని తెలుసుకో గలిగాడు. విశ్వంలోని ప్రతిది ప్రపంచంలోని ప్రతి మనిషికి అందాలని తపించే శాస్త్రవేత్త మరణించిన తరువాత ఒక పనికిరాని వస్తువుగా చిత్రించిన మతస్థులపై ధ్వజమెత్తవలసిన అవసరాన్ని రచయితలు, మేధావులు గుర్తించాలి బావ. నిజమే ఇంకా ఎన్నివందలు ఏళ్లు మత విషకౌగిలిలో మగ్గి పోవాలి బావ. నిజమేబావ అయితే కొందరు స్వార్థపరులు మను ధర్మ శాస్త్రాన్ని అడ్డంపెట్టుకుని వారు పల్లకీ ఎక్కి అమాయకులను బోయీలుగ మారుస్తున్నారు. దానికే ఖర్మ సిద్ధాంతాన్ని వల్లెవేస్తారు. మనిషిని కులం, మతం, అధికులు, అధములని వర్గాలుగ విభజించివారి పబ్బం గడుపు కుంటున్నారు బావ. అంతేగాని ప్రాణం పోగానే మనిషిని మతం చెప్పినట్లు నీచంగా చూడటం, ఇంట్లో ప్రాణంపోతే తెచ్చి బైట పెట్టడం నీచ సంస్కృతిగా భావించాలి బావ. కాని బావ జైనమతస్థులు అలా బైటపెట్టరు బావ యింట్లోనే ఉంచడం మాపక్కింట్లో నేను చూశాను బావ. నిజమే బావ మానవుడు రోజురోజుకు పురోగతివైపు అడుగులేస్తున్న ఈ తరుణంలో మతం తిరోగమనం వైపునకు నెట్టడం కడుశోచనీయం బావ. ఇప్పటికైనా ఈ అర్థంలేని ఆచారాలకు స్వస్తిపలికి అభ్యుదయం వైపు అడుగిడి ప్రతివారు అవయవదానం చేయాలి బావ. అవయవదానం ద్వారా మనం మరొకరికి బతుకునిచ్చామని సంతోషించాలి. కులమతాల చట్రంలో యిరుక్కుని భావ దాస్యం చేస్తున్న నేటి సమాజాన్ని చైతన్యపరిచే బాధ్యతను అక్షరసృష్టికర్తలు భుజాన వేసుకోవలసిన అవసరం ఉంది బావ. ఈ కర్తవ్యాన్ని రేపటిదాక రచయితలు వాయిదా వేయకుండా వెంటనే ముడిచిన పెన్ను క్యాప్ తీయాలి బావ. నిజమే బావ మనిషి ఉద్యోగం కోసం కాక జ్ఞానాభివృద్ధి కోసం చదవాలి. మనుషులకు మధ్య అడ్డుగోడలుగా ఉన్న కులమతాలకు, మూఢనమ్మకాలకు స్వస్తి పలకాలి.

సెల్: 9885569394

పోరాటాల వేదికగా ఏఐటీయూసీ మహాసభలు

చలసాని వెంకట రామారావు

భారతదేశ తొలి కేంద్ర కార్మికసంఘం ఏఐటియూసీ, 42వ జాతీయ మహాసభ 2022 డిసెంబరు 16-20 తేదీలలో కేరళ రాష్ట్రంలోని అలప్పుజలో జరుగుతుంది. కేరళ రాష్ట్రంలో అతి చిన్న జిల్లా అలప్పుజ. ఇది మున్సిపల్ పట్టణం. ప్రకృతి అందాలకు పేరెన్నిక గన్నది. సముద్రపు బ్యాక్‌వాటర్, హౌస్ బోట్ల విహారానికి ఇది ప్రసిద్ధి. తూర్పుభారత్ 'వెనిస్' నగరంగా ఇది ప్రసిద్ధి చెందింది. క్రీస్తుపూర్వం, మధ్యయుగాల లోనే ప్రాచీన గ్రీస్, రోమ్‌లతో వ్యాపార సంబంధాలను కలిగిఉంది. ప్రకృతి అందాలకు, పచ్చని ధాన్యం పంట పొలాలకు, కొబ్బరి తోటలకు ఇది ప్రసిద్ధి. కాలువలు, సముద్రపు బ్యాక్ వాటరుతో ఏర్పడిన సరస్సులు, చెరువులు, స్వచ్ఛమైన నీటితో ఏర్పడిన తటాకాలు, ఉప్పునీటి కయ్యలు కొల్లలుగా ఇక్కడ ఉంటాయి. 19వ శతాబ్దపు నాటి అలప్పుజ బీచ్‌లోని వైట్‌హౌస్ పర్యాటకులకు స్వాగతం చెబుతూ ఠీవిగా నిలిచిఉంటుంది. పున్నమడ సంస్సులో జరిగే స్నేక్ బోట్ పందాలు తనవితీరా చూచి తరించాల్సిందే! తిరువాన్కూర్ దివాన్ రాజకేశవదాసు ఆధునిక అలెప్పి పట్టణ నిర్మాతగా కీర్తి గడించారు. 1859లోనే మొట్టమొదటి ఆధునిక పరిశ్రమను ఇక్కడ స్థాపించారు. స్వాతంత్ర్య ఉద్యమంలోసైతం అలెప్పి ప్రముఖపాత్ర వహించింది. అంటరాని తనానికి వ్యతిరేకంగా టి.కె.మాధవన్ ఇక్కడ నుంచే పోరాడారు. కేరళ రాష్ట్రంలోనే మొట్టమొదటి రాజకీయ సమ్మె 1938లో ఇక్కడ జరిగింది. 1957 ఆగస్టు 17న కొట్టాయం-కొల్లాం జిల్లాలనుంచి విడగొట్టి అలప్పుజ జిల్లాగా ఏర్పాటుచేశారు. పున్నప్రా-వాయలార్ తిరుగుబాటుకు, స్వతంత్ర తిరువాన్కూర్ సంస్థానానికి జరిగిన వ్యతిరేక పోరాటానికి అలప్పుజ నిలయం. ఆల్ తిరువాన్కూర్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఏఐటీయూసీ) కార్యకర్తలపై పోలీసుస్టేషన్‌పై దాడి చేశారు. అక్కడే కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని స్థాపించారు. దానికి ప్రతిగా రెండువేలమంది కమ్యూనిస్టులు అలప్పుజ పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. కమ్యూనిస్టులు స్థానిక తయారీ ఆయుధాలతో పోరాడారు. 1946 అక్టోబరు 27న తిరువాన్కూరు ఆర్మీ వాయలార్‌ను చుట్టుముట్టి 470 మంది కమ్యూనిస్టులను కొద్ది నిమిషాలలోనే చంపి వేశారు. ఈ సంఘర్షణలలో 40 మంది సైనికులు చనిపోయారు. ఆ తర్వాత ట్రావెన్‌కోర్, కొచ్చిన్ రాష్ట్రాలు 1949 జులై1న విలీనమయ్యాయి.

ప్రస్తుత దేశరాజకీయ పరిస్థితులలో ఏఐటీయూసీ జాతీయ మహాసభలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. గత ఎనిమిది ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వపాలన అన్ని రంగాలలో ప్రజల, కార్మికుల కష్టజీవుల హక్కులపై దాడిచేస్తున్నది. నోట్లరద్దు, జీఎస్టీ వంటి వాటితో పేద వర్గాల ఆదాయం తగ్గి జీవన వ్యయం పెరిగిపోయింది. కరోనా సందర్భంలో వలస కార్మికులు, సామాన్యప్రజలు, ఉపాధి కోల్పోయిన పేదల పట్ల మోదీ అనుసరించిన వైఖరి తీవ్ర విమర్శలకు గురైంది. ముస్లిం వ్యతిరేకతలో భాగంగా జాతీయపౌరసత్వం నమోదు చట్టం తీసుకువచ్చారు. కశ్మీరులో ఆర్టికల్ 370ని రద్దుచేసి, కశ్మీర్ విభజనకు పాల్పడ్డారు. కశ్మీర్ పౌరసమాజాన్ని అప్రకటిత ఎమర్జెన్సీతో అతలాకుతలం చేశారు. రాజకీయ

నాయకులపై నిర్బంధాలు విధించారు. వీటిని ప్రశ్నించిన మేధావులను అర్బన్ నక్సలైట్లుగా ముద్రవేసి జైలుపాలు చేశారు. దేశంలో మత ఉద్రిక్తతలు, జాతి వైషమ్యాలు రెచ్చగొట్టే చర్యలలో భాగంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు సైనిక శిక్షణ ఇస్తున్నారు. గాంధీని హత్యచేసిన గాడ్సేను దేశభక్తునిగా ప్రచారం చేస్తున్నారు. విద్యారంగంలో మతోన్మాద భావజాలాన్ని ప్రవేశపెట్టేందుకు విశ్వవిద్యాలయాలకు అధిపతులుగా హిందు మతోన్మాదులను తీసుకువస్తున్నారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనాస్వేచ్ఛకు సంకెళ్లువేసి మనువాద సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా రాజ్యవ్యవస్థలో మార్పులు తేవాలని చూస్తున్నారు.

బీజేపీ ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల మాంద్యం ఏర్పడి ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోయి పరిశ్రమలు మూతబడి నిరుద్యోగం గతంలో ఎన్నడూలేని స్థాయిలో పెరిగింది. పేదరికంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారతదేశం ఉంది. ఆర్థిక అసమానతలు రోజురోజుకు పెరిగిపోయి సమాజం అసమతుల్యతకు గురవుతున్నది. ప్రభుత్వం ప్రకటించిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామి గాలికి కొట్టుకుపోయింది. వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి గురైన ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. పొలం పనులు చేయవలసిన రైతులు రోడ్లమీద దీక్షలు చేయవలసి వస్తున్నది. పెట్రోల్, డీజిల్, ఎరువులు, పురుగుమందుల ధరలతోపాటు అన్ని నిత్య జీవితావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఉత్పాదకరంగానికి బదులు అనుత్పాదక రంగాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

ప్రభుత్వరంగ బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రైవేటీకరణ కొనసాగుతున్నది. కొట్లాది రూపాయలు సామాన్యప్రజల డబ్బు బ్యాంకులలో, ఇన్సూరెన్స్ కంపెనీలలో డిపాజిట్ల రూపంలో ఉంది. ప్రభుత్వరంగంలో ప్రజాప్రయోజనాలకు వినియోగించాల్సిన డిపాజిట్లు ప్రైవేటు వ్యక్తుల పరం అవుతున్నాయి. ప్రైవేటురంగం సామాజిక బాధ్యతలను స్వీకరించనందున ప్రజాప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వరంగంలోని బొగ్గు, ఉక్కు పరిశ్రమ, రద్దురవాణా, నౌకా, రైల్వే, విమానరంగాలలో వేగంగా ప్రైవేటీకరణ జరుగుతున్నది. చివరకు దేశరక్షణ రంగంలోని ఆయుధ తయారీ సహా వివిధ అంశాలలో ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచారు. నిర్మాణరంగానికి ఆయువుపట్టు అయిన సిమెంట్, ఉక్కు వంటి రంగాలు ప్రైవేటుకు బదలాయించారు. కమ్యూనికేషన్, శాటిలైట్ టెక్నాలజీ ఎంతో అభివృద్ధిని సాధించి దేశానికి ఆర్థిక వనరుగా ఉంటే వీటినిసైతం ప్రైవేటు రంగానికి అప్పగించారు.

కార్మికరంగంలో అనేక దశాబ్దాలపాటు దేశస్వాతంత్ర్యానికి ముందు తర్వాత పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారు. యాజమాన్య వర్గాలకు, కార్పొరేట్‌లకు ప్రయోజనాలుచేకూర్చి కార్మికుల హక్కులు హరించే కార్మిక కోడ్‌లను దేశకార్మికవర్గం ఎంతగా వ్యతిరేకించినా ప్రభుత్వం వాటి అమలుకు ప్రయత్నాలు ప్రారంభించింది. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఫిక్స్‌డ్ టైం ఉపాధిపేరుతో ఉద్యోగభద్రత, కనీసవేతనం లేని ఉద్యోగాలను సృష్టించి కార్మిక శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నది. ప్రభుత్వ స్కీంలపేరుతో అంగన్‌వాడి, ఆశా, మధ్యాహ్నభోజన పథకం వంటి వాటితో వలంటీర్లపేరుతో స్వల్పంగా గౌరవవేతనం ఇచ్చి కార్మికుల శ్రమశక్తిని పాలకులే దోపిడీ చేస్తున్నారు. వారికి ఉద్యోగభద్రతగాని, లివింగ్ వేజ్‌గాని ఇవ్వనిరాకరిస్తున్నారు. వారిని కార్మికులుగానే గుర్తించడంలేదు. నేషనల్ మానిటైజేషన్ ఆఫ్‌పైప్‌లైన్‌పేరుతో వేలకోట్ల విలువచేసే సంస్థలను పెట్టుబడిదారుల పరం చేస్తున్నారు. భూగర్భ కేబుల్స్, పైప్‌లైన్లను ప్రైవేటీకరిస్తున్నారు. స్కీం కార్మికులు, హాకర్లు, ఇంటిపనివారు, బీడీ కార్మికులు, నిర్మాణరంగ కార్మికులు, విద్యుత్ కార్మికుల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక తప్పని పరిస్థితులలో అర్ధాకలితో జీవితాలు వెళ్లదీస్తున్నారు.

పాలకుల అస్తవ్యస్త కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 2022, మార్చి 28,29 తేదీలలో 10 కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 20కోట్లమంది ఉద్యోగులు, కార్మికులు రెండురోజుల సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. అయినా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోలేదు. కనీసం కార్మిక సంఘాలతో చర్చలు కూడా చేయడంలేదు. బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడు సంవత్సరాలుగా 'ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్' జరపలేదు. 2014లో జరిగిన సమావేశంలోనూ, అంతకుముందు కాంట్రాక్టు కార్మికుల రెగ్యులైజేషన్ స్కీంలలో పనిచేసే వారికి కార్మికులుగా గుర్తింపు,కనీస వేతనాల చెల్లింపు, సామాజిక భద్రత వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు చేసినా ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఈ అంశాలపై 2022 నవంబరు 30న ఢిల్లీలో కేంద్ర కార్మిక సంఘాలసమావేశం జరిగింది. 2023 జనవరి 30న అమలరవీరుల దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో సదస్సు నిర్వహించాలని, ఆ సదస్సులో భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. జి20 దేశాల కార్మిక సమస్యలను చర్చించే ఎల్-20 అధ్యక్షస్థానానికి ఆర్ఎస్ఎస్ బలపర్చే భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్)ను కేంద్ర ప్రభుత్వ నామినేట్‌చేయడాన్ని సమావేశం తిరస్కరించింది.

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు

ఎల్డీఎఫ్ ప్రభుత్వంపై నీలాపనిందలు

ఎం కోటేశ్వరరావు

నూటనలభై రోజులుగా లాటిన్ కాథలిక్ చర్చి తిరువనంత పురం పెద్దల మార్గదర్శనంలో నడిచిన విఝింజమ్ రేవు నిర్మాణ వ్యతిరేక కమిటీ డిసెంబరు ఆరవ తేదీన బేషరతుగా ఆందోళనను విరమించింది. అయితే ఇది తాత్కాలికమని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సిఎంతో చర్చలు జరిపిన తరువాత ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ కమిటీ అంతకు ముందు లేవనెత్తిన ఏడు డిమాండ్లలో రేవు నిర్మాణం ఆపాలన్నదాన్ని మినహా మిగిలిన ఆరింటిని ప్రభుత్వం ఎప్పుడో అంగీకరించింది. అయినప్పటికీ తరువాత కూడా దాన్ని కొనసాగించేందుకు, శాంతి భద్రతల సమస్య సృష్టికి చూసినప్పటికీ సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం, పోలీసుశాఖ ఎంతో సంయమనం పాటించిన కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగలేదు. మంగళవారం జరిగిన చర్చల్లో ఆందోళన కమిటీ లేవనెత్తిన ఏ డిమాండ్‌ను ప్రభుత్వం ఆమోదించలేదు. అంతకు ముందు ఈ ఆందోళనను ఆసరా చేసుకొని ప్రభుత్వం, సీపీఎం గురించి తప్పుడు ప్రచారం చేసేందుకు, వాస్తవాలను వక్రీకరించేందుకు చూశారు. వాటిలో ఒకటి "అదానీ విఝింజమ్ రేవు నిర్మాణానికి చేతులు కలిపిన సీపీఐ(ఎం)-బీజేపీ" అంటూ పత్రికల్లో వచ్చిన వార్త శీర్షిక. నవంబరు 26,27 తేదీలలో రేవు నిర్మాణ ప్రాంతంలో జరిగిన విధ్వంసకాండపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)తో విచారణ జరిపించాలన్న వినతిని హైకోర్టు తిరస్కరించింది. అదానీ కంపెనీ కోరినట్లుగా రేవు రక్షణకు కేంద్ర బలగాల ఏర్పాటుకు తమకు అభ్యంతరం లేదని ప్రభుత్వం, సీపీఎం చెప్పగా బీజేపీ వ్యతిరేకించింది. తాము కూడా రేవు నిర్మాణానికి అనుకూలమే అన్న కాంగ్రెస్ దాన్ని అడ్డుకోచూసిన ఆందోళన కారులకు పరోక్షంగా వత్తాసు పలికింది. తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిధరూర్ రేవు నిర్మాణం జరగాలంటూనే ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నట్లు విలేకర్లతో చెప్పారు. మతం రంగు పులిమేందుకు, రెచ్చగొట్టేందుకు కాషాయ దళాలు విఫలయత్నం చేశాయి. రేవు నిర్మాణం ఆపేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేరళ రాజధాని తిరువనంతపురం దగ్గర నిర్మితమౌతున్న రేవునిర్మాణం మీద తలెత్తిన వివాదం గురించి జరుగుతున్న పరిణామాలపై వాస్తవాలను తప్పుదారి పట్టించే ప్రచారానికి పైన పేర్కొన్న వార్తా శీర్షిక ఒక ఉదాహరణ. రేవు అభివృద్ధిని వ్యతిరేకిస్తూ ఆందోళన జరుపుతున్న వారు లేవనెత్తిన ఏడు డిమాండ్లలో ఆరింటిని అంగీకరించామని, నిర్మాణం ఆపాలి, వద్దు అన్న ఏడవ అంశాన్ని అంగీకరించేది లేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పష్టం చేశారు. తమ ఆందోళన ఒక దశకు వచ్చినందున తాత్కాలికంగా విరమిస్తున్నామని ఆందోళన కమిటీ కన్వీనర్ ఫాదర్ ఫెరీరా మంగళవారం సాయంత్రం ప్రకటించారు. విఝింజమ్ రేవు వద్ద జరిగిన ఉదంతాలపై న్యాయవిచారణ జరిపించాలని, సముద్రపోటుకు ఇండ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించేంత వరకు నెలకు ఎనిమిది వేలు అద్దెగా చెల్లించాలని, దీనిలో రేవు కంపెనీ అదాని కంపెనీ సొమ్ము ఉండ కూడదని, ఈ ప్రాంతంలో సముద్రతీర కోతపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటుచేసే కమిటీలో స్థానిక ప్రతినిధి ఒకరు ఉండాలని ఆందోళనకారులు ప్రభుత్వం ముందు నాలుగు డిమాండ్లను ఉంచారు. దేన్నీ ప్రభుత్వం అంగీకరించలేదు. అద్దెగా చెల్లించాలన్న ఎనిమిది వేలలో ప్రభుత్వం ఐదున్నరవేలు, అదానీ రేవు కంపెనీ సిఎస్ఆర్ నిధుల నుంచి మరో రెండున్నరవేలు చెల్లించేందుకు చూస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనను చర్చి పెద్దలు తిరస్కరించారు.

విఝింజమ్ రేవును మూడు దశల్లో నిర్మించాలన్నది పథకం. 2019 డిసెంబరు నాటికి తొలిదశ పూర్తి కావాలనుకున్నది జరగలేదు, తరువాత 2020 ఆగస్టుకు పొడిగించారు. 2023 సెప్టెంబరు నాటికి పూర్తి చేసేందుకు జరుగుతున్న పనులను రేవు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న వారికి స్థానిక చర్చి నేతలు మార్గ దర్శకులుగా ఉన్నారు. ప్రయాణీకులు, కంటెయినర్, ఇతర సరకు రవాణా ఓడలను నడిపేందుకు కేరళ ప్రభుత్వం విఝింజమ్ ఇంటర్నేషనల్ సీ పోర్ట్స్ లిమిటెడ్(విఐఎస్ఎల్) పేరుతో ఒక కంపెనీని ఏర్పాటు చేసింది. ఈ రేవు అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ ఓడల రవాణా మార్గానికి చాలా దగ్గరగా ఉన్నందున ఇతర దేశాల నుంచి వచ్చే వాటిని కూడా ఆకర్షించి ఇతర రేవుల నుంచి వచ్చే సరకుల ఎగుమతి-దిగుమతి ఓడల అవసరాలకు ఇది అనువుగా ఉంటుంది. కొలంబో, సింగపూర్, దుబాయి రేవులకు వెళ్లే కొన్ని ఓడలు ఇటు మరలుతాయి. దీని నిర్మాణం గురించి పాతిక సంవత్సరాలుగా చర్చ ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో చేపట్టేందుకు గతంలో రెండుసార్లు టెండర్లు పిలిచినా ఫలించలేదు. తొలుత ఒక చైనా కంపెనీకి టెండరు దక్కినా కేంద్రం నుంచి దానికి భద్రతా పరమైన అనుమతి రానందున రద్దైంది. తరువాత లాంకో గ్రూపుకు ఇవ్వటాన్ని జూమ్ డెవలపర్స్ అనే సంస్థ కోర్టులో సవాలు చేసింది. దాంతో అదీ జరగలేదు. మూడవసారి 2014లో పిలిచిన టెండర్లకు అదానీ సంస్థ ఒక్కటే వచ్చింది, దాంతో 2015లో నాటి యుడిఎఫ్ (కాంగ్రెస్‌కూటమి) ప్రభుత్వం అదానీ కంపెనీకే ఇచ్చి ఒప్పందం చేసుకుంది. నాటి సిఎం ఊమెన్ చాందీ శంకుస్థాపన కూడా చేశారు. దీని ప్రకారం వెయ్యిరోజుల్లో రేవునిర్మాణం పూర్తి కావాలి. రు.7,525 కోట్ల ఈ పథకానికి నిరసనగా 2022 ఆగస్టు 16 నుంచి స్థానిక మత్స్యకారులు ఆందోళనకు పూనుకున్నారు. దానికి చర్చి పెద్దలు నాయకత్వం వహించారు. ప్రతిఆదివారం చర్చి ప్రార్థనల్లో ఆదేశాలు జారీచేశారు. కొందరు పర్యావరణవేత్తలు కూడా రేవును వ్యతిరేకిస్తున్నారు. దీని వలన తీర ప్రాంతం మీద ప్రతికూల ప్రభావం పడుతుందన్నది వారి వాదన. సముద్ర తీరం కోతకు గురవుతుందని, తమ జీవనాధారం దెబ్బతింటుందని చేపలుపట్టేవారు అంటున్నారు. ఆందోళన ప్రారంభం నాటికి సగం రేవుపనులు పూర్తైనందున ఆపే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. చర్చలకు రావాలంటే ముందుగా నిర్మాణపనులు ఆపాలనే షరతు విధిస్తున్నారు. ప్రభుత్వం దానికి అంగీకరించ లేదు.

రేవు నిర్మాణంలో తమకు రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ దళాలను రప్పించాలని అదానీ గ్రూపు రాష్ట్ర హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడేందుకు తమకు కేంద్ర దళాల అవసరం లేదని, కావాలని అదానీ కంపెనీ కోరింది తప్ప తాము కాదని రాష్ట్ర రేవుల శాఖ మంత్రి అహమ్మద్ దేవరకోవిల్ స్పష్టం చేశారు. ఈ రేవు నిర్మాణం ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పిపిపి) పద్ధతికి మారుగా కౌలు పద్ధతిని పాటించాలని నాడు ప్రతిపక్షంలో ఉన్న ఎల్‌డిఎఫ్ కోరింది. పిపిపిపద్ధతిలో రు.7,525కోట్లకుగాను అదానీ రు.2,454 కోట్లు మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సి ఉంటుంది. ఒక ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదాన్ని తరువాత వచ్చిన ప్రభుత్వం తిరగదోడితే నిర్మాణ హక్కు పొందిన వారికి పెద్ద మొత్తంలో నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. అందువలన తాను వ్యతిరేకించినప్పటికీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమలుకు కట్టుబడిఉంది. ఈ ఆందోళనకు మద్దతుఇచ్చిన కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి, తమ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం గురించి వేరే విధంగా మాట్లాడటం వెనుక ఓట్ల రాజకీయం ఉంది. లాటిన్ కాథలిక్ మతపెద్దలు గతంలో ఆ పార్టీకి మద్దతు ఇచ్చినందున ఆ పార్టీ లబ్ది పొందింది. సకాలంలో నిర్మించలేదని, చర్చిడిమాండ్లను పరిశీలించలేదని ఆరోపించింది.

రేవునిర్మాణాన్ని అడ్డుకుంటూ ప్రధాన ద్వారం వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు అడ్డుగా నిలిచారు. ఒక వైపు క్రైస్తవ మత పెద్దలు పల్లెకారులను రెచ్చగొట్టి ఆందోళనకు పురికొల్పుతుంటే మరోవైపు దాన్నిసొమ్ము చేసుకొనేందుకు బిజెపి మద్దతు ఉన్న శక్తులు రేవుకు మద్దతుపేరుతో హిందూఐక్యవేదిక వంటి సంఘపరివార్ సంస్థలకు చెందినవారు కాషాయ జండాలతో మరోవైపున టెంట్లువేసి రెచ్చగొట్టేందుకు, మతం రంగు పులి మేందుకు చూశారు. విఝింజమ్ రేవు పరిరక్షణ సమితి పేరుతో ఉన్నవారు ఇచ్చినపిలుపులో భాగంగా జరిగిన ప్రదర్శనలలో పార్టీలతో నిమిత్తం లేకుండా రేవు నిర్మాణం జరగాలని కోరుకునే వారందరూ పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర ఇంఛార్జులుగా ఉన్న ప్రకాష్ జవదేకర్, రాధామోహన్‌దాస్ అగర్వాల్‌తో కేంద్ర మంత్రి మురళీధరన్‌తో కలసి రాష్ట్రనేతలు దీన్ని గురించి చర్చించనున్నారు. విఝింజమ్‌లో కేంద్రదళాల గురించి విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని మురళీధరన్ ఆరోపించారు. దీనికి బాధ్యత బీజేపీదే అని, కేంద్రప్రభుత్వం క్రైస్తవ మైనారిటీలకు వ్యతిరేకమని చిత్రించేందుకు ఎల్‌డిఎఫ్ చూస్తున్న దని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సి కృష్ణకుమార్ చెప్పారు.

ఢిల్లీలో 67శాతం కౌన్సిలర్లు కోటీశ్వర్లు

ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్తగా ఎన్నికైన 250 మంది కౌన్సిలర్లలో 67శాతం మంది కోటీశ్వరులేనని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. 2017లో మూడు మున్సిపల్ కార్పొరేషన్‌లకు సంబంధించి 270 వార్డులకు ఎన్నికలు జరగగా 51శాతం మంది కోటీశ్వరులు ఉన్నట్లు తెలిపింది. ఈ మూడు కార్పొరేషన్‌లను ఈ ఏడాది ఒకటిగా విలీనం చేసి వార్డుల సంఖ్యను 250కి తగ్గించారు. ఉత్తర, దక్షిణ, తూర్పు కార్పొరేషన్‌లకు జరిగిన గత ఎన్నికల్లో 134 సీట్లు సాధించిన బీజేపీకి ఈ ఎన్నికల్లో కేవలం 104 మాత్రమే లభించాయి. కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకోగా ముగ్గురు ఇండిపెండెంట్లు విజయం సాధించారు. ఎన్నికైన 248 మంది కౌన్సిలర్ల ఆదాయ వివరాలను పరిశీలించగా 167(67శాతం) మంది కోటీశ్వరులుగా తేలింది. అన్ని పార్టీల కన్నా బీజేపీ కౌన్సిలర్ల ఆస్తులు అధికమని నివేదిక వెల్లడించింది. మొత్తం 82 మంది కౌన్సిలర్లు కోటికి పైగా ఆస్తులు ఉన్నట్లు పేర్కొంది.

ఆప్‌కు చెందిన 77 మంది కోటీశ్వరులుగా ప్రకటించారు. బీజేపీకి చెందిన 104మందిలో 82(79శాతం)మంది, ఆప్ నుంచి 132 మందిలో 77(58శాతం), కాంగ్రెస్ నుంచి 9 మందిలో ఆరుగురు (67శాతం) కోటీశ్వరులని నివేదిక వివరించింది. నామినేషన్ పత్రాలతో పాటు అభ్యర్థులు సమర్థించిన అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ ఈ వివరాలు బహిర్గతం చేసింది. విజయం సాధించిన 104మంది బీజేపీ కౌన్సిలర్ల సరాసరి ఆస్తి విలువ రు.5.29 కోట్లు ఉండగా 132 మంది ఆప్ కౌన్సిలర్ల సరాసరి ఆస్తి విలువ రూ.3.56 కోట్లుగా నిర్ధారించింది.

మున్సిపల్ ఎన్నికల్లో నోటాకు 57 వేలకుపైగా ఓట్లు

ఢిల్లీలో అధికార పార్టీ ఆప్ మరోసారి సత్తా చాటింది. ఈ నెల 4న జరిగిన ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించిన చీపురుపార్టీ తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంది. ఎంసీడీలో మొత్తం 250 సీట్లకుగాను ఆప్ 134 సీట్లు గెలుపొందింది. రాజధాని నగరంలో 15 ఏళ్లపాటు చక్రం తిప్పిన బీజేపీని 104 వార్డులకే పరిమితం చేసింది. అయితే ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. గత ఆదివారం జరిగిన పోలింగ్‌లో అర లక్షకుపైగా ఓట్లు నోటా గుర్తుకు పడ్డాయి. అంటే తమకు ఏ అభ్యర్థి నచ్చలేదని ఓటర్లు స్పష్టం చేయడం విశేషం. ఢిల్లీలో మొత్తం 1,45,05,358 ఓటర్లు ఉన్నారు. వారిలో 78,93,418 పురుషులు, 66,10,879 మంది మహిళలు, 1,061 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎంసీడీ ఎన్నిలకల్లో 50.48 శాతం మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో 57,545 మంది నోటాకు ఓటేశారు. అంటే 0.78 శాతం మంది అన్నమాట.

దూసుకొస్తున్న 'మాండస్'

చెన్నై: దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర తుపానుగా మారింది. ప్రస్తుతం ఇది తమిళనాడువైపు దూసుకొస్తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై సహా పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. చెన్నైలో లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వర్షం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'మాండస్' తుపాను హెచ్చరిక నేపథ్యంలో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో నేటి నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు కురిసే అవకాశమున్న జిల్లాల్లో సహాయక చర్యల కోసం జాతీయ విపత్తుల నివారణ (ఎన్డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపింది. కాగా, 'మాండస్' తుపాను ఈనెల 9వ తేదీ రాత్రి తమిళనాడులోని మహాబలిపురం సమీపంలో తీరం తాటుతుందని ఐఎండీ తెలిపింది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 70 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. సముద్రం అలజడిగా ఉంటుందని, దక్షిణకోస్తా, తమిళనాడు తీరాల వెంబడి శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ల కూడదని రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే వెనక్కి తిరిగి రావాలని కోరింది.

1957 ఎన్నికల్లో మెయిన్‌పురి స్వతంత్ర అభ్యర్థికి సున్నా ఓట్లు

లక్నో: సమాజ్‌వాదీ పార్టీకి గడచిన రెండున్నర దశాబ్దాలుగా అత్యంత గట్టిపట్టు ఉన్న మెయిన్‌పురి పార్లమెంటరీ నియోజకవర్గానికి ఘనమైన చరిత్ర ఉంది. అదేంటంటే... అక్కడ నుంచి పోటీచేసిన అభ్యర్థికి కేవలం సున్నా ఓట్లు దక్కాయి. 1957వ సంవత్సరం సాధారణ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన శంకర్ లాల్‌కు ఒక్క ఓటు కూడా దక్కలేదు. తన ఓటు తనకే వేసుకోలేకపోయారు. ఎందుకంటే ఈ ఓటును ఎన్నికల సంఘం తిరస్కరించింది. ఎన్నికల సంఘం రికార్డుల ప్రకారం, ఈ పోటీలో ప్రజా సోషలిస్ట్ పార్టీ నుంచి దాస్ ధన్‌గర్, బాద్‌షా (కాంగ్రెస్), జగదీశ్ సింగ్ (ఆల్ ఇండియా భారతీయ జన సంఘ్), స్వతంత్ర అభ్యర్థులుగా మణిరామ్, పుత్తో సింగ్, శంకర్‌లాల్ నిలబడ్డారు. బన్సీదాస్ ధన్‌గర్ ఎన్నికల్లో 59,902 ఓట్లతో విజేతగా నిలవగా, కాంగ్రెస్‌కు చెందిన బాద్‌షా తరువాత స్థానంలో 56,072 ఓట్లు దక్కించుకున్నారు. ఆల్ ఇండియా భారతీయ జన్‌సంఘ్ అభ్యర్థి జగదీశ్ సింగ్ 46,627 ఓట్లు దక్కించుకోగా, స్వతంత్ర అభ్యర్థి మణిరామ్, పుత్తోసింగ్ 17,972 ఓట్లు, 16,177 ఓట్లు దక్కించుకున్నారు. ఇక శంకర్‌లాల్‌కు సున్నా ఓట్లు దక్కాయి. ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములయాంసింగ్ యాదవ్ చనిపోవడంతో ఈ స్థానంల ఉప ఎన్నిక వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య, ములయాంసింగ్ పెద్ద కోడలు డింపుల్ యాదవ్ ఈ స్థానంలో పోటీ చేస్తున్నారు.

నాపై ట్విట్టర్‌లో విమర్శలు చేయొద్దు: స్పీకర్



న్యూఢిల్లీ: ట్విట్టర్‌లో తనకు వ్యతిరేకంగా విమర్శలు చేయవద్దంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గురువారం ఎంపీలను హెచ్చరించారు. స్పీకర్ ఏ ఎంపీ పేరును ప్రస్తావించనప్పటికీ తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు మహువా మొయిత్రా పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సంబంధించిన సమస్యను లేవనెత్తిన వెంటనే లోక్‌సభలో ఆయన పై విధంగా స్పందించారు. సభ్యులకు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని కొందరు సభ్యులు కొన్నిసార్లు ట్విటర్‌లో రాస్తుంటారు... దయచేసి సభ్యులు స్పీకర్ గురించి ట్విట్టర్‌లో రాయకూడదని గుర్తుంచుకోండి... అది మంచిది కాదని ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన అన్నారు.

'ఆప్'కు జాతీయ హోదా

న్యూఢిల్లీ: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో వెనకబడ్డ ఆమ్ ఆద్మీ పార్టీకి కొంత ఊరట లభించింది. ఈ ఎన్నికల్లో సాధించిన ఓట్లతో పార్టీకి జాతీయ హోదా లభించనుంది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ, పంజాబ్ లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గోవాలోనూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. తాజాగా గుజరాత్ లో కూడా తగిన ఓట్ల శాతాన్ని దక్కించుకోనుంది. ప్రస్తుత ఫలితాల ట్రెండ్ చూస్తే.. గుజరాత్ లో ఆరు చోట్ల ఆప్ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు. ఈ ఫలితాలతో పార్టీకి జాతీయ హోదా ఖాయమైందని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా మీడియాకు తెలిపారు. ఓ ప్రాంతీయ పార్టీకి జాతీయ పార్టీ హోదా దక్కాలంటే కనీసం నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి కనీస ఓట్ల శాతం, ఎమ్మెల్యే, ఎంపీ సీట్లను గెలుచుకోవాలి. ఈ క్రమంలో ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ గోవా ఎన్నికల్లోనూ ప్రభావం చూపింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం రెండు సీట్లతో పాటు 6 శాతం ఓట్లను సాధిస్తే ఆమ్ ఆద్మీ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం జాతీయపార్టీగా గుర్తిస్తుంది. ఆమ్‌ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ హోదా వచ్చింది... అందుకు గుజరాత్ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ పేర్కొన్నారు. గురువారంనాడిక్కడ విలేకరులతో మాట్లాడుతూ... 'ఆప్ కేవలం 10 సంవత్సరాలలో జాతీయ పార్టీ హోదాను కైవసం చేసుకోగలిగింది. అది ఈ పార్టీ వృద్ధి వేగం. గుజరాత్‌లో మాకు దాదాపు 35 లక్షల ఓట్లు వచ్చాయి. నాయకులందరూ కష్టపడి గుజరాత్‌లోని గ్రామీణ ప్రాంతాలను సందర్శించారు' అని ఆయన అన్నారు. గుజరాత్‌ను బీజేపీ సొంతగడ్డగా పరిగణిస్తున్నప్పటికీ ఆప్ 35 లక్షల ఓట్లను సాధించిందని చెప్పారు.

ఎల్పీజీ కనెక్షన్లు 32.5 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో వంటగ్యాస్ కనెక్షన్ల (ఎల్పీజీ)సంఖ్య 2014లో 14కోట్ల వరకు ఉండగా, ఈ ఏడాది లో ఆ సంఖ్య 32.5 కోట్లకు చేరింది. వీటిలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై) కింద 9.6 కోట్ల కనెక్షన్లు అందించినట్లు కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీ గురువారం లోక్‌సభకు తెలిపారు. పీఎంయువై లబ్దిదారుల్లో అవగాహన కల్పించడానికి, దాని వినియోగాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వంతో పాటు చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశవ్యాప్తంగా ఎల్పీజీ పంచాయత్‌లు, సామాజిక మాధ్యమ ప్రచారాలు, బహిరంగ కార్యక్రమాలు నిర్వహించినట్లు మంత్రి ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించారు.

కేరళలో 'ఉమెన్ ఫ్రెండ్లీ టూరిజం నెట్‌వర్క్'

తిరువనంతపురం: లక్షమంది మహిళా ప్రయాణికులు, పారిశ్రామికవేత్తలు సభ్యులుగా ఉమెన్ ఫ్రెండ్లీ టూరిజం నెట్‌వర్క్ రూపకల్పనకు కేరళ ప్రభుత్వం యోచిస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ గురువారం తెలిపారు. రాష్ట్రాన్ని పూర్తి మహిళా-స్నేహపూర్వక పర్యాటక గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో, బాధ్యతాయుత పర్యాటక మిషన్ అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో ఇప్పటికే 1000 మందికి పైగా మహిళలు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. సాధారణంగా సెలవులకు దక్షిణాది వెళ్లేవారికి సురక్షితమైన గమ్యస్థానమని, ఒంటరి మహిళా ప్రయాణికులతో సహా పర్యాటకులందరికీ భద్రత కల్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన తెలిపారు. టూరిజం కేంద్రాలను మహిళా-స్నేహపూర్వకంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్ల గురించి తెలుసుకునేందుకు అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి నమోదు చేసుకున్న మహిళల్లో ఇప్పటికే 400 మందికి ఆన్‌లైన్ శిక్షణ పూర్తయిందని ఆయన చెప్పారు.

ఆప్‌కు బీజేపీ నిధులు

సిద్ధరామయ్య విమర్శ

మైసూరు: కాంగ్రెస్ ఓట్లు చీల్చడానికి గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)కి బీజేపీ నిధులు సమకూర్చిందని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విమర్శించారు. గుజరాత్‌లో బీజేపీ తిరిగి విజయం సాధించడంపై స్పందిస్తూ ఎన్నికల్లో కమలం పార్టీ భారీగా డబ్బు ఖర్చు పెట్టిందని చెప్పారు. 'గుజరాత్‌లో ఆప్ సైతం భారీగా డబ్బు వెచ్చించింది. నాకున్న విశ్వసనీయ సమాచారం మేరకు కాంగ్రెస్ ఓట్లు చీల్చడానికి ఆప్‌కు బీజేపీ భారీగా నిధులు ఇచ్చింది. ఈ ఎన్నికల్లో ఆప్ పోటీ చేయడానికి అదే ప్రధాన కారణం' అని సిద్ధరామయ్య గురువారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. కొత్తగా వచ్చిన ఆప్...కాంగ్రెస్ ఓట్ల శాతాన్ని తగ్గించి...పదిశాతం సాధించిందని గుర్తుచేశారు. 'ఈ ఎన్నికల్లో ఆప్ భారీగా డబ్బు వెదజల్లింది. కాంగ్రెస్ కన్నా ఎక్కువ ఖర్చు పెట్టింది. అయినా ఆ పార్టీ కేవలం ఐదు సీట్లు మాత్రమే గెలుచుకుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో బీజేపీ గెలుపు తననేమీ ఆశ్చర్యానికి గురిచేయలేదని చెప్పారు. అన్ని సీట్లలోనూ కాంగ్రెస్ ఓట్లను ఆప్ భారీగా చీల్చిందని చెప్పారు. గుజరాత్ ఎన్నికల ప్రభావం కర్ణాటకపైనా పడుతుందా అని ప్రశ్నించగా ఒక రాష్ట్రంలో ఉన్న పరిస్థితి మరో రాష్ట్రంలో ఉండబోదన్నారు. ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించకపోవడంపై స్పందిస్తూ కార్పొరేషన్‌లో సమస్యల ప్రాతిపదికనే ఎన్నికలు జరుగుతాయని సిద్దరామయ్య అన్నారు. ఢిల్లీలో మోదీ గాలి ఏమైందని ప్రశ్నించారు. మోదీ హవా కొనసాగితే ఢిల్లీలో ఎలా ఓటమి చెందారని నిలదీశారు.

రచయిత్రి ఫర్హత్ ఖాన్ అరెస్టు

భోపాల్: రచయిత్రి డాక్టర్ ఫర్హత్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె రచించిన 'కలెక్టివ్ వయిలెన్స్ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్' అనే పుస్తకంలో హిందువులపై అభ్యంతరకర అంశాలు ఉన్నాయంటూ బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘం ఏబీవీపీ ఫిర్యాదుతో డాక్టర్ ఖాన్‌ను అరెస్టు చేశారు. పూణెలో ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు మధ్యప్రదేశ్ మంత్రి నరోత్తమ్ మిశ్రా స్పష్టం చేశారు. హాస్పిటల్‌లో డయాలసిస్ చేయించుకుంటున్న సమయంలో ఆమెను పోలీసులు అరెస్టు చేశారు. తాను రచించిన 'కలెక్టివ్ వయిలెన్స్ అండ్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్' పుస్తకాన్ని ఇండోర్‌లో ఓ ప్రభుత్వ లా కాలేజీలో ఆమె ఉంచారు. అయితే ఆ పుస్తకంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే అంశాలు ఉన్నట్లు ఏబీవీపీ ఆరోపిస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, డాక్టర్ ఖాన్ తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు రెగ్యులర్‌గా డయాలసిస్ చేస్తున్నారు. ఖాన్‌కు వ్యతిరేకంగా ఈ నెల 3న ఫిర్యాదు నమోదైంది. పుస్తక ప్రచురణకర్తలైన అమర్ లా పబ్లికేషన్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇనామ్ ఉర్ రెహ్మాన్, ప్రొఫెసర్ మీర్జా మోజిజ్ బెయిగ్‌లపై కూడా కేసు నమోదు చేశారు.

తగ్గిన విద్యుత్ లోటు: కేంద్రమంత్రి

న్యూఢిల్లీ: విద్యుత్ లోటు (అవసరం, సరఫరాకు మధ్య తేడా) గణనీయంగా తగ్గిందని కేంద్రం తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో విద్యుత్ లోటు రెండు శాతంగా ఉంటే అక్టోబరు నాటికి 0.1శాతానికి క్షీణించిందని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ గురువారం లోక్‌సభకు రాతపూర్వకంగా తెలిపారు. ఏప్రిల్‌లో 2,752 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఉంటే అక్టోబరులో 124 మిలియన్ యూనిట్లకు తగ్గిందన్నారు. మేలో 608 మిలియన్ యూనిట్లు (ఎంయూ), జూన్‌లో 796 ఎంయూ (0.6శాతం), జులైలో 434ఎంయూ (0.3శాతం), ఆగస్టులో 465 ఎంయూ (0.2శాతం), సెప్టెంబరులో 312 ఎంయూ (0.3శాతం) చొప్పున విద్యుత్ లోటు నమోదైనట్లు వెల్లడించారు. మార్చి 31 నాటికి బొగ్గు నిల్వ 25.6 మిలియన్ టన్నులు (ఎంటీ) లేదా తొమ్మిది రోజులకు సరిపడ ఉండగా సెప్టెంబరు 30కి 26.1ఎంటీలకు, నవంబరు 30నాటికి 30.9 మిలియన్ టన్నులు (11రోజుల స్టాక్)కు బొగ్గు నిల్వలు పెరిగినట్లు మరొక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. నవంబరు 30కి దేశంలోని 180 ప్లాంట్లకుగాను 75 ప్లాంట్ల (56శాతం)లో నిల్వలు తగ్గినట్లు సింగ్ తెలిపారు. మరోవైపు ఇంధన వినియోగం 2026-27లో 19,07,835 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందన్న అంచనా ఉండగా అది ప్రస్తుతం 13,81,646 ఎంయూలుగా ఉన్నది. అలాగే, విద్యుత్ డిమాండ్ 2026-27 నాటికి 2,77,201 మిలియన్ వాట్లుగా ఉంటుందని, 2021-22లో 2,03,115 మిలియన్ వాట్లు విద్యుత్ వినియోగమవుతోందని ప్రభుత్వ డేటా చెబుతోంది. 215 గిగావాట్ల డిమాండ్ ఉంటే 408.7 గిగావాట్ల సామర్థ్యం పెంచామని, థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని 25,580 మెగావాట్లకు, పునరుత్పాదక ఇంధనం సామర్థ్యాన్ని 76,130మెగావాట్లకు పెంచే పని జరుగుతున్నట్లు మంత్రి వేరొక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఒక ఇంటిగ్రేటెడ్ గ్రిడ్‌తో దేశం అనుసంధానమై ఉండగా తద్వారా నలుమూలలకు 12 గిగావాట్ల విద్యుత్ సరఫరా అవుతోంది అని ఆయనన్నారు.

కాంగ్రెస్ గుజరాత్ ఇన్‌చార్జ్ రాజీనామా

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జి రఘుశర్మ గురువారం రాజీనామా చేశారు. బీజేపీకి, ఆప్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సాగించిన 'మౌన' ప్రచారానికి శర్మ సారథ్యం వహించారు. ఊహించని విధంగా ఓటమిని చవిచూడాల్సి రాగా ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ గుజరాత్ ఇంచార్జిగా శర్మ రాజీనామా చేశారని పార్టీ రాష్ట్ర వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ గుజరాత్ అధ్యక్షుడు జగదీశ్ ఠాకూర్ కూడా త్వరలోనే తన రాజీనామాను సమర్పించనున్నట్లు పేర్కొన్నాయి. గుజరాత్‌లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీశ్ దోషి మాట్లాడుతూ పార్టీ ఎంతో శ్రమించినప్పటికీ అనుకోని ఓటమి ఎదురైందని అన్నారు. ఈ పరిస్థితిని సమీక్షిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేలను కాపాడుకుంటాం

సీఎం భూపేంద్ర బాఘెల్



రాయ్‌పూర్: హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. గత అనుభవాల దృష్ట్యా తమ ఎమ్మెల్యేలను బీజేపీ తన్నుకుపోతుందనే భయం కాంగ్రెస్‌లో ఏర్పడింది. ఇదే భయాన్ని చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేంద్ర బాఘెల్ గురువారం వ్యక్తంచేశారు. గెలిచిన ఎమ్మెల్యేలను తమ వైపునకు తిప్పుకోవడానికి బీజేపీ ప్రయత్నించే ప్రమాదం ఉందని, అందువల్ల ఎమ్మెల్యేలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని బాఘెల్ అభిప్రాయపడ్డారు. అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని వ్యాఖ్యానించారు. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పరిశీలకుడిగా బాఘెల్ వ్యవహరించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను చత్తీస్‌గఢ్ తరలిస్తున్నట్లు వచ్చిన వార్తలను ఆయన తోసిపుచ్చారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. తమ మిత్రులు(ఎమ్మెల్యేలు)ను కాపాడుకోవాల్సిన అవసరం మాత్రం ఉందని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు బాఘెల్ సమాధానం చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీకి బీ టీమ్ అని ఆయన ఆరోపించారు.

కోటా బిల్లుకు గవర్నరు అడ్డు

రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లను 76శాతానికి పెంచడానికి సంబంధించిన రెండు బిల్లులకు గవర్నరు అనుసూయ యూకీ ఇంకా ఆమోదం తెలపలేదని సీఎం బాఘెల్ చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సంబంధించి రిజర్వేషన్లు కల్పించడానికి ఉద్దేశించిన చత్తీస్‌గఢ్ పబ్లిక్ సర్వీస్(ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు) సవరణ బిల్లు, చత్తీస్‌గఢ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్(ప్రవేశాలలో రిజర్వేషన్లు) సవరణ బిల్లుకు డిసెంబరు 3న అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లును ప్రభుత్వం గవర్నరు వద్దకు పంపింది. ఈ బిల్లు ప్రకారం ఎస్టీలకు 32శాతం, ఇతర వెనుకబడిన కులాలకు 27శాతం, ఎస్సీలకు 13శాతం, ఆర్థికంగా బలహీన వర్గాలు(ఈడబ్ల్యూఎస్)కు నాలుగు శాతం రిజర్వేషన్లను ఉద్యోగ, విద్యా ప్రవేశాలకు కల్పించడానికి వీలవుతుంది. ఈ రెండు కోటా బిల్లులను గవర్నరు ఆమోదించడంలో జాప్యానికి కారణమేమిటని ప్రశ్నించగా రాజ్‌భవన్ ఇంతకుముందు విడుదల చేసిన ప్రకటనను తాము విశ్వసిస్తున్నామని, సాధ్యమైనంత త్వరగా అసెంబ్లీ ఆమోదిస్తే గవర్నరు వెంటనే సమ్మతి తెలుపుతుందని వెల్లడించిందని బాఘెల్ గుర్తుచేశారు. అయినా ఇప్పటి వరకు గవర్నరు ఆమోదముద్ర లభించలేదని తెలిపారు. బిల్లులకు న్యాయపరమైన చిక్కులు ఏమైనా ఉన్నాయా అని అడుగగా ఆ విషయాలు కోర్టులు చూసుకుంటాయన్నారు. గవర్నరు వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో రిజర్వేషన్లు ఆపడానికి బీజేపీ ప్రయత్నిస్తుందా అని ప్రశ్నించగా వెంటనే ఆమోదం తెలుపుతానని గవర్నరు హామీ ఇచ్చినప్పటికీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని, దీని ఆధారంగా ఏమి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చని బాఘెల్ వ్యాఖ్యానించారు. రాష్ట్రమంత్రి అమర్‌జిత్ భగత్ బుధవారం గవర్నరును కలిసి...సత్వరమే బిల్లులు ఆమోదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

బీజేపీ వ్యతిరేక శక్తుల్ని ఏకం చేయాలి

ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్

ముంబై: మహారాష్ట్రలో రాజకీయ శూన్యతను పూరించగలిగే సామర్థ్యం ఎన్సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)కి ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు శరద్‌పవార్ అభిప్రాయపడ్డారు. తదుపరి తరం నాయకులను నిర్మించడానికి రాష్ట్ర నాయకత్వం కృషి చేయాలని కోరారు. మహారాష్ట్ర పార్టీ కార్యవర్గ సమావేశంలో పవార్ ప్రసంగిస్తూ... ఏ రాష్ట్రంలోనైనా రాజకీయ శూన్యత ఎప్పుడూ ఉంటుందని అన్నారు. గుజరాత్‌లో బీజేపీ, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారా అది పూరించబడిందని చెప్పారు. 'మహారాష్ట్రలో అటువంటి శూన్యత ఉంది...ఎన్సీపీ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించడం ద్వారా దానిని భర్తీ చేయగలదు... బీజేపీ సిద్ధాంతాలను వ్యతిరేకించే అన్ని శక్తులను ఏకం చేయడానికి మనం కృషి చేయాలి' అని పవార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యం అయినప్పటికీ ఎన్సీపీ నాయకత్వం నిశ్చింతగా ఉండరాదని, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడానికి ఈ సమయాన్ని ఉపయోగించుకోవాలని పవార్ ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిసెంబర్ 17న ముంబైలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనకు ఎన్సీపీ నాయకత్వం వహిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కర్ణాటకతో చెలరేగుతున్న సరిహద్దు వివాదంపై మాట్లాడుతూ... మరాఠీ మాట్లాడే ప్రజల హక్కులపై మహారాష్ట్ర వైఖరిని దక్షిణాది రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం వేరే స్థాయికి తీసుకువెళ్లిందని పవార్ పేర్కొన్నారు. 'కర్ణాటక ప్రభుత్వం మరాఠీ మాట్లాడే ప్రజలను అణచివేయడానికి తన యంత్రాంగాన్ని ఉపయోగించింది. ఇప్పుడు వారు తమ శాసనసభ శీతాకాల సమావేశాలను బెల్గావిలో నిర్వహిస్తున్నారు' అని ఆయన అన్నారు. నాసిక్ జిల్లాలోని కొన్ని గ్రామాలను గుజరాత్‌లో విలీనం చేయాలనుకుంటున్నట్లు ఎన్సీపీ తాలూకా అధ్యక్షుడు ప్రకటించడంపై కూడా పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది జరగకూడదు. మహారాష్ట్ర ఐక్యత కోసం ఎన్సీపీ అన్నివిధాలా పోరాడుతుంది' అని పవార్ అన్నారు.

అధిష్ఠానమే నిర్ణయిస్తుంది

హిమాచల్ సీఎంపై సుధీర్‌శర్మ

ధర్మశాల: హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించింది. దీంతో రాష్ట్రానికి కాంగ్రెస్ సీఎం అభ్యర్థి ఎవరన్న ప్రశ్న తెరపైకొచ్చింది. సీఎం అభ్యర్థి ఎవరన్నది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని కాంగ్రెస్ నేత సుధీర్ శర్మ అన్నారు. ధర్మశాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శర్మ తన ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి రాకేశ్ చౌదరిని 3,285 ఓట్లతో ఓడించారు. తనను గెలిపించిన ధర్మశాల ప్రజలకు రుణపడి ఉంటానని, వారి ఆకాంక్షలు నెరవేరేలా కృషిచేస్తానని ఆయనన్నారు. కాంగ్రెస్ తప్పక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. అయితే ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరని విలేకరులు ప్రశ్నించగా దీనిపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి అంతా కట్టుబడి ఉంటారని ఆయన బదులిచ్చారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శి అయిన శర్మకు ముఖ్యమంత్రిగా అవకాశమున్నట్లు ఊహాగానాలు ఉన్నాయి. శర్మ గతంలో గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. 2003లో బైజ్‌నాథ్ నియోజకవర్గం నుంచి హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి తొలిసారి ఎన్నికయ్యారు. 2007లో అదే స్థానం నుంచి గెలిచారు. 2012లో ధర్మశాల నుంచి మూడవ విజయాన్ని అందుకున్నారు.

మాజీ పీఎంలు, సీనియర్ ఎంపీలకు ప్రాధాన్యం

రాజ్యసభ చైర్మన్ ధన్కర్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ వంటి అనుభవజ్ఞులైన ఎంపీలకు నిబంధనలతో సంబంధం లేకుండా ముఖ్యమైన అంశాలపై అభిప్రాయాలు చెప్పడానికి ప్రాధాన్యత ఇస్తామని రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్ గురువారం సభకు హామీ ఇచ్చారు. బుధవారం రాజ్యసభ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ధన్కర్‌ను సత్కరిస్తూ... చట్టాలు, జాతీయ ప్రయోజనాలపై అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అనుభవజ్ఞులైన సభ్యులకు తగిన సమయం ఇవ్వాలని కొందరు ఎంపీలు సూచించిన నేపథ్యంలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ధన్కర్ మాట్లాడుతూ... ఎంపీలు ముఖ్యమైన సమస్యలను పార్టీలకతీతంగా లేవనెత్తాలని చైర్మన్ కోరారు. రాజ్యసభ నియమాల ప్రకారం రాజకీయ పార్టీల సంఖ్యాబలం ప్రకారం చర్చల సమయంలో సమయాన్ని కేటాయించాల్సి ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో ఎంపీలున్న పార్టీకి ఎక్కువ సమయం ఇవ్వబడుతుంది. సభలో దేవెగౌడ తన పార్టీ (జేడీఎస్) ఏకైక సభ్యుడు, అందుకే తన అభిప్రాయాలను తెలియజేయడానికి అతి తక్కువ సమయాన్ని కేటాయించారు. సభలో ఇద్దరు మాజీ ప్రధానులు... హెచ్‌డి దేవెగౌడ, మన్మోహన్ సింగ్ - ఎంపీలుగా ఉన్నారని గమనించిన చైర్మన్...ముఖ్యమైన విషయాలపై వారి అభిప్రాయాలు మొత్తం దేశానికి ఇన్‌పుట్‌గా ఉపయోగపడతాయని అన్నారు. 'ఒక సమస్యపై గౌరవనీయులైన మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ మాట్లాడాలనుకుంటే అది యావత్ దేశానికి ఇన్‌పుట్ అవుతుంది. నేను మొదట అతనిని, అతని దృష్టిని తరువాత నియమావళిని చూస్తాను' అని ధన్కర్ చెప్పారు. జైరామ్ రమేష్ (కాంగ్రెస్) వంటి సీనియర్ ఎంపీలు కూడా తమ నైపుణ్యం విషయంలో జోక్యం చేసుకోవాలనుకుంటే వారికి సమయం ఇస్తామని ఆయన అన్నారు.

మీరు కాంగ్రెస్ పతనంపై ఆందోళన చెందాలి: షెకావత్

న్యూఢిల్లీ: గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందిన నేపథ్యంలో, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్...గురువారం లోక్‌సభలో ఆ పార్టీ నాయకుడు అధీర్ రంజన్ చౌదరిని ఎగతాళి చేశారు. పశ్చిమ బెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలోని తన నియోజకవర్గంలో గంగానదికి గండి పడటం వల్ల జరిగిన నష్టం గురించి ప్రశ్నోత్తరాల సమయంలో చౌదరి అడిగిన అనుబంధ ప్రశ్నకు జలశక్తి మంత్రి షెకావత్ సమాధానమిచ్చారు. నదీజలాల బీభత్సం వల్ల జరిగిన నష్టం కంటే కాంగ్రెస్ పతనం గురించి మీరు ఎక్కువగా ఆందోళన చెందాలని షెకావత్ అన్నారు. నది ఉధృతి తీవ్రమైన సమస్య అని, దీనికి చాలా కారణాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆక్రమణలు కూడా ఒక కారణమని మంత్రి తెలిపారు. ఎత్తిపోతల నిర్మాణానికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, సమస్య ఎదుర్కొంటున్న వివిధ రాష్ట్రాలకు గత కొన్నేళ్లుగా రూ.1,282 కోట్ల ఆర్థిక సాయం అందించిందని ఆయన చెప్పారు.

మా ఓట్లు లేకుండా ఎలా గెలుస్తావ్?

- రాష్ట్రంలో 3.5 కోట్ల మంది శ్రమ జీవులు
- ఒకటవ తేదీన జీతాలు ఇవ్వలేని జగన్ ప్రభుత్వం
- ఐక్య పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారం
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు
- ముగిసిన ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు

విశాలాంధ్ర-ఒంగోలు: ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న శ్రమజీవుల సమస్యలు పరిష్కరించకుండా తిరిగి అధికారంలోకి ఎలా వస్తావు జగన్ అని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రశ్నించారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు చెందిన కార్మికులు 3.5కోట్ల మంది ఉన్నారని ఆయన గుర్తుచేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభల సందర్భంగా గురువారం ప్రతినిధుల సభ జరిగింది. ప్రతినిధుల సభకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిర్ల కృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌డీ సర్దార్, కోటి దాసు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఓబులేసు ప్రారంభోపన్యాసం చేస్తూ శ్రమకు తగిన ఫలితం అడుగుతుంటే పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా ఓట్ల కోసం తమ చుట్టూ తిరిగి...అధికారం చేజిక్కిన తర్వాత తమకు విలువ ఇవ్వకపోవడం దారుణమన్నారు. జీతాల కోసం ధర్నాలు చేస్తుంటే...మంత్రులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ నెలలో ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు ఇవ్వలేదన్నారు. కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా చేస్తున్నారన్నారు. పచ్చదనం-పరిశుభ్రత కార్మికులకు 30 నెలలుగా జీతాలు లేవన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య కార్మికులకు 4,5 నెలలకు ఒకసారి జీతాలు ఇస్తున్నారని చెప్పారు. 9 డీఏలకు దిక్కులేదన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు ఇన్ని సమస్యలున్నా ముఖ్యమంత్రి మాత్రం 85శాతం హామీలు అమలు చేశామని, ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పటం సిగ్గుచేటన్నారు. కష్టజీవుల ఓట్లు లేకుండా 175 స్థానాలలో ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో రూ.1000 జీతం పెంపు కోసం 13 రోజులు ధర్నా చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికనేతలతో చర్చలు జరిపిన తర్వాతే రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ కార్మికరంగం ప్రమాదకర స్థితిలో ఉందన్నారు. కరోనా సమయంలో 170 మంది పారిశుద్ధ్య కార్మికులు చనిపోతే...దానిని ప్రభుత్వం గుర్తించలేదని, ఆ కుటుంబాలకు పరిహారం రూ.50 లక్షలు ఇవ్వలేదన్నారు. మాస్కులు, గ్లౌజులు, మంచినీటిని సైతం పోరాటాల ద్వారానే సాధించుకున్నామన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలకు పరిష్కారమన్నారు. కార్యదర్శి నివేదికను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు ప్రవేశపెట్టారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తులసేంద్ర, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఎం.సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి, నాయకులు కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రంగనాయకులు, సుబ్బరాయుడు

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఆసుల రంగనాయకులు, పోరుమామిళ్ల సుబ్బారాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 54 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. అందులో రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా 27 మందిని ఎన్నుకున్నారు.

ఆర్వీ రామారావ్‌కు తుమ్మల సాహితీ పురస్కారం

విశాలాంధ్ర-గుంటూరు: ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నిర్మాత తుమ్మల వెంకట్రామయ్య స్మారకార్థం విశాలాంధ్ర విజ్ఞాన సమితి, అభ్యుదయ రచయితల సంఘం నిర్వహిస్తున్న పురస్కారాన్ని ఈ సంవత్సరానికి అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, విశాలాంధ్ర దినపత్రిక సంపాదకులు ఆర్వీ రామారావ్‌కు అందజేస్తున్నట్లు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో ఈ పురస్కారాన్ని ఆర్వీ రామారావుకు విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరనాథరెడ్డి అందజేస్తారన్నారు. ఈ పురస్కారం క్రింద 5వేల నగదు, జ్ఞాపిక, శాలువతో ఆర్వీ రామారావ్‌ను సత్కరిస్తారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే ఈ సభలో 'ప్రగతిశీల సంస్కృతిపై దాడి' అంశంపై ఆర్వీ రామారావు తుమ్మల స్మారక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జి.ఓబులేసు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర నాయుడు తదితరులు సభలో పాల్గొంటారని తెలిపారు. పత్రికా రచనలో, సాహిత్య రంగంలో నాలుగున్నర దశాబ్దాల అనుభవం కలిగిన రామారావు వివిధ పత్రికలలో ప్రధాన బాధ్యతలు వహించారు. వట్టికోట ఆళ్వారుస్వామి ప్రజల మనిషి నవలను, డాక్టర్ వై.రాధాకృష్ణమూర్తి ఆత్మకథను ఆంగ్లంలోకి అనువదించారు. అనేక రచనలను తెలుగులోకి అనువదించారు. వందలాది రాజకీయ వ్యాఖ్యానాలు, సాహిత్య వ్యాసాలను రామారావు రచించారు. అనేక గ్రంథాలను వెలువరించారు.

కిడ్నీ వ్యాధితో మరొకరి మృతి

విశాలాంధ్ర-ఏకొండూరు: ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం గొల్లమందల తండాలో కిడ్నీ వ్యాధితో మరొకరు మృతి చెందారు. తండాకి చెందిన భూక్య కొక్యా (61) గురువారం తెల్లవారుజామున తన ఇంటి వద్దనే మృతి చెందాడు. మృతుడి భార్య తిరుపతమ్మ తెలిపిన వివరాల ప్రకారం... తన భర్త గత పది ఏళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడని ఇటీవల కొంతకాలం విజయవాడలోనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించామని, ప్రస్తుతం విస్సన్నపేటలో ప్రైవేటు వైద్యుని వద్ద వైద్యం చేయిస్తూ మందులు వాడుతున్నా మని తెలిపింది. రక్త పరీక్షలు చేయించిన డాక్టర్లు క్రియాటిన్ లెవెల్ 10.4 ఉన్నట్టు చెప్పారని వా రాసిన అన్ని మందులు వాడుతున్నామని ఇప్పటివరకు తన భర్త వైద్యానికి ఎనిమిది లక్షల రూపాయలు పైనే ఖర్చు పెట్టామని రోదిస్తూ తెలిపింది. తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోయినా తన ఇద్దరు కుమారులతో పాటు తాను కష్టపడి పనిచేయడంతో పాటు అందినకాడికి అప్పులు చేసి తన భర్తకు వైద్యం చేయించినట్లు ఆమె పేర్కొంది. తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కాగా మూడురోజుల క్రితం కృష్ణారావు పాలెంలో దాసరి కృష్ణకుమారి అనే మహిళ కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. మూడు రోజులు కూడా గడవకముందే గొల్లమందల తండాలో మరో ఘటన చోటు చేసుకోవడం స్థానికుల్లో ఆందోళన రేపుతోంది.

కొక్యా కుటుంబాన్ని ఆదుకోవాలి

కొక్యా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రాముడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అతనికి వైద్యం చేయించడానికి కుటుంబ సభ్యులు అప్పుల పాలయ్యారని తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవలసిన అవసరం ఉందన్నారు. కొండూరు మండలంలో కిడ్నీ మరణాలు నిరంతరాయంగా సంభవిస్తున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని కిడ్నీ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికే కిడ్నీ బాధిత కుటుంబాలు తమకు ఉన్న ఆస్తులు అమ్ముకొని అప్పులపాలై ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కిడ్నీ వ్యాధితో మృతి చెందిన ప్రతి ఒక్క కుటుంబానికి 5 లక్షల ఎక్స్గ్రేషియా, ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదలకు ప్రభుత్వమే ఉచితంగా ఇళ్లు ఇవ్వాలి

డీహెచ్‌పీఎస్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ మేరకు ప్రభుత్వమే నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేనిపక్షంలో ఇల్లు కట్టుకోడానికి రూ.5లక్షలు ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) డిమాండ్ చేసింది. సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం గురువారం సమితి అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ అధ్యక్షతన విజయవాడ లోని దాసరి భవన్‌లో జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ... రాష్ట్రంలో జగనన్న కాలనీల్లో కనీస సదుపాయాలు లేక ఇళ్ల నిర్మాణం అగమ్యగోచరంగా తయారయిందన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.లక్షా ఎనభైవేల రూపాయలు ఎంత మాత్రం సరిపోవన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వమే తన హామీ మేరకు ఇళ్లను పూర్తిగా నిర్మించి ఇవ్వాలని లేనిపక్షంలో లబ్ధిదారులకు రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో కోనేరు రంగారావు సారథ్యంలో ఏర్పాటైన కమిటీ రాష్ట్రంలోని దళితుల సమస్యలను, భూమి స్థితిగతులను పరిశీలించి అనేక సిఫార్సులు చేసిందని తెలిపారు. అవి ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తన తండ్రి ఆశయాలను ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ పరిగణలోకి తీసుకుని కోనేరు రంగారావు సిఫార్సులను అమలు చేయాలని జల్లి విల్సన్ కోరారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ... దేశంలో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దళితుల పట్ల వివక్షత, దాడులు, రిజర్వేషన్లపై దుష్ప్రచారం, మత సామరస్యంపై వ్యతిరేకతలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జాతీయ దళిత సంఘాలు ఢిల్లీలో సదస్సు జరిపి దళితుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించాయని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో కార్యాచరణ రూపొందించి భవిష్యత్‌లో ప్రజాస్వామ్యవాదులను, ప్రగతిశీల శక్తులను కలుపుకుని జాతీయ ఉద్యమాలను ఉధృతం చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. రాష్ట్రంలో జిల్లాల విభజన జరిగిన నేపథ్యంలో జిల్లా సమావేశాలు నిర్వహించి నూతన కమిటీల ఏర్పాటు చేయాలని సూచించారు. దళితులపై జరుగుతున్న దాడులను క్షేత్రస్థాయిలో ఎదుర్కోవాలని చెప్పారు. ఈ సమావేశంలో సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, ఉపాధ్యక్షులు తాటిపాక మధు, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

భూసాధన రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి: డీహెచ్‌పీఎస్

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల్లో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను చేర్చి పేదలకు భూ పంపిణీ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన డిసెంబర్ 21న విజయవాడలో జరిగే భూసాధన సదస్సును జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్ పిలుపు నిచ్చింది. దీర్ఘకాలంగా పేదలు సాగు చేసుకొంటున్న, నివాసం ఉంటున్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులతో పట్టాలివ్వాలని, పేదలకు అన్యాయం చేసే అసైన్డ్ భూముల అమ్మకాలు, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన 9/77 అసైన్డ్ చట్టం సవరణల్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. భూసాధన రాష్ట్ర సదస్సులో డీహెచ్‌పీఎస్ శ్రేణులు పాల్గొని విజయంతం చేయాలని రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఆ సదస్సులో రిటైర్డ్ ఐఏఎస్ కె.రాజు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మాజీ ఎంపీ నాగేంద్రనాథ్ ఓఝా, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పాల్గొంటారని పేర్కొంది.

కొలీజియానికి కట్టుబడాల్సిందే

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: న్యాయమూర్తుల నియామకంలో కీలకంగా వ్యవహరించే కొలీజియం వ్యవస్థ మన దేశ చట్టమని, దీనికి వ్యతిరేకంగా మాట్లాడితే సహించబోమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కొలీజియం వ్యవస్థ అనుసరణీయమని, దీనికి అందరూ కట్టు బడాలని తేల్చిచెప్పింది. రాజ్యాంగబద్ధ న్యాయ స్థానాల్లో జడ్జీల నియామకాల కోసం కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను ఆమోదించేందుకు కేంద్రం జాప్యం చేస్తుండటంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారించింది. సుప్రీంకోర్టు కొలీజియంపై ప్రభుత్వ పెద్దల వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు జస్టిస్ ఎస్‌కే కౌల్ నేతృత్వ జస్టిస్ ఏఎస్ ఓకా, జస్టిస్ విక్రమ్‌నాథ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి స్పష్టం చేయాల్సిందిగా అటార్నీ జనరల్ ఆర్ వెంటకరమణికి సూచించింది. సర్వోన్నత న్యాయ స్థానం సూచించే న్యాయపరమైన సిద్ధాంతాలకు కట్టుబడాలని తేల్చిచెప్పాలని పేర్కొంది. కొలీజియం సిఫార్సు చేసిన 19 పేర్లను ప్రభుత్వం తిప్పి పంపడాన్ని ప్రస్తావించింది. పింగ్-పాంగ్‌లా ఈ జాబితాను అటు-ఇటూ పంపుతుంటే నియామకాలు జరిగేదెప్పుడు అని సర్వోన్నత ధర్మాసనం ప్రశ్నించింది. కొలీజియం వ్యవస్థ ఉన్నంత వరకు దానికి కట్టుబడాల్సిందేనని, మరొక చట్టం తేవాలని భావిస్తే ఎవరూ ఆపడంలేదని కేంద్రాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించింది. దేశంలో ఏ చట్టాన్ని అనుసరించాలి ఏది అనుసరించకూడదో సమాజంలోని ఒక వర్గం నిర్ణయిస్తే పతనం తప్పదని హెచ్చరించింది. అమల్లో ఉన్న చట్టానికి ప్రతి ఒక్కరు కట్టుబడాల్సిందేనని తెలిపింది. 'ఈ కోర్టు ప్రకటించే ఏదేని చట్టాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించి తీరాల్సిందేనని చెప్పదలిచాను' అని జస్టిస్ కౌల్ అన్నారు. కొలీజియం మళ్లీ మళ్లీ సిఫార్సు చేసినప్పటికీ కొన్ని పేర్లు నెలలు కాదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం కోర్టును ఇబ్బంది పెట్టిందని ధర్మాసనం పేర్కొంది. 'హైకోర్టు కొలీజియం అర్హుల పేర్లను సిఫార్సు చేస్తుంది. వాటిని సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలిస్తుంది. ఆ సమయంలో సీనియారిటీతో సహా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది' అని తెలిపింది. కొలీజియం వ్యవస్థపై రాజ్యాంగ ధర్మాసనం తీర్పుకు కట్టుబడి ఉండాల్సిందేనని నొక్కిచెప్పింది. తదుపరి విచారణను జనవరి 6వ తేదీకి వాయిదావేస్తూ ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు, కేంద్రప్రభుత్వానికి మధ్య కొలీజియం వ్యవస్థపై వివాదం కొనసాగుతుండటం తెలిసిందే.

త్వరలో ఎస్పీ, పీఎస్‌పీఎల్ విలీనం?

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గురువారం తన పార్టీ జెండాను, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ(లోహియా) వ్యవస్థాపకుడు శివపాల్ సింగ్ యాదవ్‌కు అందజేశారు. తాజా ఈ పరిణామాలను గమనిస్తున్న రాజకీయ విశ్లేషకులు సమాజ్‌వాదీ పార్టీ, ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ (లోహితయా) విలీనమవుతాయని భావిస్తున్నారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో మెయిన్‌పూరీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్పీ అభ్యర్థి డింపుల్ యాదవ్ 2.88 లక్షల ఓట్ల ఘన విజయం సాధించారు. ఈ క్రమంలోనే ఇటావా జిల్లాలోని సైఫైలో నాయకులు ఇద్దరు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అఖిలేశ్ ఎస్పీ జెండాను శివపాల్‌కు బహూకరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను వారు ట్విట్టర్‌లో పెట్టారు. శివపాల్ సింగ్ యాదవ్‌కు చెందిన కారుకు ఎస్పీ జెండా అతికించి ఉండటాన్ని చూస్తుంటే రెండు పార్టీలు విలీనమయ్యే అవకాశం ఉందని కార్యకర్తలు భావిస్తున్నారు. సమాజ్‌వాదీ వ్యవస్థాపకుడు ములయాంసింగ్ యాదవ్ మరణం తరువాత ఉప ఎన్నిక అనివార్యమవడం, డింపుల్ యాదవ్ కీలక గెలుపు కోసం బాబాయ్-కొడుకులు చేతులు కలపడం అనివార్యమైందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ప్రభుత్వ బంగ్లాను ఖాళీచేసిన మెహబూబా

శ్రీనగర్: వారం క్రితం ప్రభుత్వ అధికారిక గృహాలను ఖాళీ చేయాలంటూ అధికారులు నోటీసులు ఇవ్వడంలో పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఎట్టకేలకు గురువారం అధికారిక బంగ్లాను ఖాళీ చేశారు. ఎనిమిదిమంది ప్రజాప్రనిధులకు నోటీసులు జారీ చేయగా, వారిలో ముఫ్తీ కూడా ఉన్నారు. గురువారం ఉదయం బంగ్లాలోని తనకు చెందిన సామగ్రితో ఆమె బయటకు వచ్చేసినట్టు అధికారులు తెలిపారు. బంగ్లాకు సంబంధించిన అన్ని డబ్బు లావాదేవీలు పూర్తయిన తరువాతే ఆమెకు బంగ్లాను ఖాళీ చేశారని పేర్కొన్నారు. అధికారులకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆమె తన చెల్లెలు ఇంటికి వెళ్లినట్లు తెలిసింది. రాజకీయాల్లో ఉన్న కారణంగా ఆమె ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతం సురక్షితం కాదనీ భద్రతా దళాలు పేర్కొంటున్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.